RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 04 అక్టోబర్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:109

## మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత

### పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి

పిల్లలు ఆన్‌లైన్ వేధింపులు, సైబర్ నేరాలకు గురికాకుండా వారికి అవసరమైన భద్రత, సంరక్షణ కోసం న్యాయ సేవల ప్రాధికార సంస్థ (ఎఉబూం) సూచనలు, కార్యక్రమాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి మద్దతునిస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. డిజిటల్ వేదికలపై పిల్లల రక్షణ కోసం వ్యవస్థలను బలోపేతం చేయడానికి న్యాయసేవల సంస్థలు చేస్తున్న మంచి కార్యక్రమాలను ప్రతి గ్రామానికి చేరేలా ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందని చెప్పారు.

జాతీయ న్యాయ సేవా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో "డిజిటల్ వేదికలపై పిల్లలకు రక్షణ, సులభంగా న్యాయం అందించడం : ఆన్‌లైన్ లైంగిక వేధింపులను అరికట్టడం, పిల్లలకు అనుకూలమైన న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడం" అన్న ఇతివృత్తంపై దక్షిణాది ప్రాంతీయ సదస్సు హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సదస్సులో కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘావాల్ , సుప్రీంకోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఔంబూం) ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ గారు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీఎస్ నరసింహ గారు, జస్టిస్ ఆర్ మహదేవన్ గారు, జస్టిస్ అలోక్ అరాధే , తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ప్యాట్రన్-ఇన్-చీఫ్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

అలాగే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, ఒడిశా, సిక్కిం, తమిళనాడు, త్రిపుర హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ శ్యామ్ కోషి గారు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, ఒడిశా, తమిళనాడు హైకోర్టుల న్యాయమూర్తులు, ఉన్నతాధికారులు, పలువురు మాజీ



న్యాయమూర్తులు పాల్గొన్నారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మహిళలు, పిల్లల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యతనిస్తోందని చెప్పారు. పోలీసులు, భరోసా కేంద్రాలు, చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు, ప్రత్యేక కోర్టులు, న్యాయ సేవా సంస్థలు వంటి అనేక వ్యవస్థలు పనిచేస్తున్నాయని వివరించారు.

"భరోసా కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ఒకేచోట పోలీసు సహాయం, వైద్య సేవలు, న్యాయ సహాయం, కౌన్సెలింగ్ అందిస్తున్నాం. దేశంలోనే తొలి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. పిల్లల రక్షణ కోసం పోలీసు శాఖలోని విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో ాఉఃఇ-భరోసా సైబర్ ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి. అఎఉఃఇఖీ యాప్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆన్‌లైన్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. విద్యార్థులనే సైబర్ అంబాసిడర్లుగా తయారు చేసి, తమ తోటి విద్యార్థులకు సైబర్ భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే పిల్లలకు రక్షణ, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించగలం" అని అన్నారు.

"ఆర్థిక సహాయం నుంచి ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశం కల్పించడం వరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎఉూ-బూం పాఠశాల విద్యాశాఖతో అవగాహన ఒప్పందం (ఓూజ) కుదుర్చుకుంది. ఉపాధ్యాయులు పిల్లలకు వారి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 3,000 మందికి పైగా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు శిక్షణ ఇచ్చాం" అని తెలిపారు. సైబర్ నేరాల వలలో పిల్లలు పడకుండా ఇలాంటి కార్యక్రమాల్లో తల్లిదండ్రులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. సైబర్ నేరాల నియంత్రణ విషయంలో ప్రతి పిల్లవాడు, తల్లిదండ్రులు నియంత్రణ కోసం ప్రత్యేకంగా కేటాయించిన నంబర్ - 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం - 1098 నంబర్లు తప్పక గుర్తుంచుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు."సైబర్ నేరాల బారిన పడకుండా పిల్లలకు తల్లిదండ్రుల మద్దతు అవసరం. పిల్లలను తప్పుబట్టే విధంగా కాకుండా ఆసక్తితో అవగాహనతో పిల్లకు మద్దతుగా మార్గదర్శకత్వం చేయాలి. పిల్లలను సురక్షితంగా ఉంచేందుకు మనమంతా కలిసి పనిచేద్దాం. అందుకు ఈ సదస్సులో జరిగే చర్చలు, సూచనలు, సిఫారసులు యావత్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తాయని విశ్వసిస్తున్నా" అని పేర్కొన్నారు.. ఔంబూం ఆధ్వర్యంలో దక్షిణాది ప్రాంతీయ సదస్సుకు హైదరాబాద్ వేదిక కావడం సంతోషకరమని పేర్కొంటూ సదస్సునకు హాజరైన ప్రతినిధులందరికీ ముఖ్యమంత్రి గారు స్వాగతం పలికారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు అత్యంత ముఖ్యమైన సైబర్ సెక్యూరిటీ అంశాన్ని ఇతివృత్తంగా ఎంచుకుని నివారణ చర్యల కోసం ఈ సదస్సు నిర్వహించడంపై ముఖ్యమంత్రి జస్టిస్ విక్రమ్ నాథ్ కి, ఔంబూం కు ధన్యవాదాలు తెలిపారు.

## 22-A సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

### నాలా అనుమతి లేకున్నా నివాస వినియోగంలోకి వచ్చిన పట్టా భూముల రిజిస్ట్రేషన్లకు తీపి కబురు
### నాలా రుసుము చెల్లింపుతో అర్హత ఉన్న భూముల రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం - ఉత్తర్వులు జారీ
### శరవేగంగా ముఖ్యమంత్రి గారి హామీల అమలు
### 22ఎ సమస్యల పరిష్కారంపై నిరంతరం మానిటరింగ్ చేయాలి
### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ : కొన్ని దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సంక్లిష్టమైన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడమే లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మరో కీలక అడుగు వేసిందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

వ్యవసాయ భూములుగా ఉన్న పట్టా భూములు, అనంతరం నివాస వినియోగంలోకి వచ్చినప్పటికీ ఏౌూ (నాలా) ప్రక్రియ పూర్తికాక రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ శనివారం నాడు మెమో జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ మేరకు మెమో నెంబర్ 48062/ULC/A1/2026 ద్వారా జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

మిగతా 2 లో

## ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

### బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై సి.ఎస్ సంజయ జాజు సమీక్ష



హైదరాబాద్, అక్టోబర్ 3: తెలంగాణా సంస్కృతీ ప్రత్యేకత గాంచిన బతుకమ్మ పూల పండగను ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. ఈనెల 10 నుండి 18 వ తేదీ వరకు నిర్వహించే బతుకమ్మ వేడుకల ఏర్పాట్ల పై శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల కార్యదర్శులు, పోలీస్ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా సిఎస్ ఈనెల 18 వ తేదీన సద్దుల బతుకమ్మ ను పురస్కరించుకొని ట్యాంక్ బండ్ పై వేలాది మంది మహిళలచే సద్దుల బతుకమ్మ ఉత్సవాన్ని అత్యంత వైభంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 18వ తేదీ సాయంత్రం 4 గంటలకు సచివాలయం ఎదురుగాగల అమరవీరుల స్మారక కేంద్రం నుండి వేలాది మంది మహిళలు బతుకమ్మలతో ఊరేగింపుగా వచ్చి ట్యాంక్ బండ్ పైకి చేరుకుంటారని, వీరితోపాటు వందలాది మంది కళాకారులు తమ కళారూపాలతో ర్యాలీగా వస్తారని వివరించారు. ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేసే ప్రత్యేక వేదిక వద్ద జరిగే ఈ బతుకమ్మ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు హాజరవుతారని అన్నారు.

మిగతా 2 లో

## ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి: మంత్రి శ్రీధర్ బాబు

### ప్రతి విశ్వవిద్యాలయంలోనూ స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్
### డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి
### జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు

తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'రీచ్--2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

మిగతా 2 లో



## వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

### పెట్టుబడుల ఆకర్షణ, ప్రభుత్వ భూముల విలువ పెంపుపై దృష్టి
### పర్యాటక రంగాన్ని కీలక ఆదాయ వనరుగా తీర్చిదిద్దాలి:
### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
### సమావేశానికి హాజరురైన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ ప్రభుత్వ ఆదాయాన్ని పెంచేందుకు సమగ్ర కార్యాచరణ చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎ×ూ పాలసీ అమలు, పర్యాటక రంగంలో పెట్టుబడుల ఆకర్షణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.రాష్ట్ర సచివాలయంలో శనివారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన వనరుల సమీకరణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. సివిల్ సప్లై, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మిగతా 2 లో



# ప్రజాబలం

04 అక్టోబర్ 2026 ఆదివారం


# మిడ్-ఎయిర్ డ్రామా

దుబాయ్ నుండి టెల్ అవీవ్‌కు బయలుదేరిన ఫ్లైదుబాయ్ విమానంలో ఆకాశంలోనే ఊహించని విధంగా అత్యంత నాటకీయమైన, తీవ్ర భయాందోళనకరమైన సన్నివేశం చోటుచేసుకుంది. ఇస్రాయెల్ ప్రయాణికులతో నిండిన ఈ విమానాన్ని కూల్చివేసేందుకు ఓమన్ దేశానికి చెందిన కో-పైలట్ యత్నించడం సంచలనం సృష్టించింది. తీవ్ర మత తీవ్రవాద భావజాలం కలిగిన ఈ ఓమన్ పైలట్, తన తోటి పైలట్‌పై ఒక్కసారిగా దాడికి తెగబడి విమానాన్ని కిందకు దించేందుకు ప్రయత్నించాడు. అతని ఉన్మాద చర్యల కారణంగా విమానం కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే ఏకంగా 14,000 అడుగుల కిందకు పడిపోయింది. అలాగే కేవలం రెండు నిమిషాల కంటే తక్కువ సమయంలో మొత్తం 17,000 అడుగుల ఎత్తు నుండి విమానం వేగంగా కిందకు దూసుకుపోవడంతో విమానంలోని ప్రయాణికులు మరణభయంతో అల్లల్లాడిపోయారుఈ భయంకరమైన సన్నివేశంలో విమాన పైలట్-ఇన్-కమాండ్, భారతీయ మూలాలున్న కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసమాన ధైర్యసాహసాలు ప్రదర్శించారు. సుమారు 13 సంవత్సరాలకు పైగా కమర్షియల్ విమానయాన అనుభవం, దాదాపు 9,750 గంటల ఫ్లయింగ్ రికార్డ్ ఉన్న స్మిత్ మచ్చర్, గతంలో స్పైస్‌జెట్‌లో 11 ఏళ్ల పాటు లైన్ ట్రైనింగ్ కెప్టెన్‌గా సేవలు అందించారు. కో-పైలట్ జరిపిన రక్తసిక్తమైన దాడిలో కెప్టెన్ స్మిత్ తీవ్రంగా గాయపడి, రక్తం ఓడుతున్నప్పటికీ, ఏమాత్రం ఉపేక్షించకుండా కాక్‌పిట్ తలుపులను అన్‌లాక్ చేయడంలో విజయం సాధించారు. విమానం నిటారుగా కిందకు పడిపోతున్న క్లిష్ట సమయంలో ఆయన కాక్‌పిట్ డోర్ తెరవడమే ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో అతిపెద్ద మలుపుగా మారింది.కాక్‌పిట్ డోర్ తెరచుకోగానే యామివ్ హయూన్ అనే ఇస్రాయెలీ ప్రయాణికుడు తక్షణమే స్పందించి కాక్‌పిట్‌లోకి దూసుకెళ్లాడు. దాడికి తెగబడిన ఓమన్ పైలట్‌ను విమాన నియంత్రణ ప్యానెల్ నుండి వెనక్కి లాగి, ఇతర ప్రయాణికులు మరియు సిబ్బంది సాయంతో అతనిని పూర్తిగా లొంగదీసుకున్నాడు. అనంతరం విమానాన్ని సురక్షితంగా రక్షించి, సౌదీ అరేబియాలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ భయంకర సంఘటనలో కాక్‌పిట్ మొత్తం రక్తసిక్తమైనట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విపత్తు సమయంలో భారతీయ కెప్టెన్ స్మిత్ మచ్చర్ ప్రదర్శించిన అద్భుతమైన సమయస్ఫూర్తి, సాహసాన్ని ఇస్రాయెల్ ప్రధాని బె?ంజమిన్ నెతన్యాహు స్వయంగా కొనియాడారు.సహచర పైలట్ల కథనం ప్రకారం, దాడికి పాల్పడిన ఓమన్ పైలట్ ఎనిమిది నెలల క్రితమే ఫ్లైదుబాయ్‌లో చేరాడని, ఆయన తీవ్ర మత తీవ్రవాద భావాలు కలిగిన వ్యక్తి అని వెల్లడైంది. రోజులో విపరీతంగా ప్రార్థనలు చేయడం, మహిళలకు కనీసం షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కూడా నిరాకరించడం వంటి ప్రవర్తన అతనిలో కనిపించేదని తెలిసింది. ఈ ఊహించని విమాన ప్రమాద ముప్పుపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు జరుగుతుండగా, ఫ్లైదుబాయ్ సంస్థ ఇస్రాయెల్‌కు రాకపోకలు సాగించే తన విమాన సేవలను తాత్కాలికంగా నిలిపివేసింది.ఫ్లై దుబాయ్ కంపెనీలో విమానాన్ని నడుపుతున్న భారతీయ పైలట్ స్మిత్ మచ్చార్ మీద ఒమన్ దేశానికి చెందిన కో పైలట్ దాడి చేసి కత్తితో అతడిని పొడిచాడు. అతడు తీవ్రంగా గాయపరుస్తున్నప్పటికీ పైలట్ ఏమాత్రం వెనుకడుగు వేయలేదు. పైగా విమానాన్ని ముందుకు పోనిచ్చాడు. విమానం తలకిందులు అవుతున్నప్పటికీ అతడు ఏమాత్రం వెనకడుగు వేయలేదు. తన ప్రాణాలు పోతాయని తెలిసినప్పటికీ కూడా తోటి ప్రయాణికుల ప్రాణాలను అతని కాపాడాడు.విమానం తలకిందులు కావడం.. అప్పటికే అది సౌదీ అరేబియా గగన తలం మీద ఉంది. అప్పటికే దాని నుంచి అత్యవసర పరిస్థితి అంటూ తబుక్ విమానాశ్రయానికి సంకేతం వచ్చింది. మరికొద్ది నిమిషాల్లోనే కోడ్ 7500 (హైజాక్) అంటూ సందేశం అందింది. ఈ సందేశంతో తీవ్ర కలకలం నెలకొంది. ఇజ్రాయిల్ దేశం మీద ఉగ్రదాడి జరుగుతుందని ప్రచారం మొదలైంది. పైగా విమానంలో ప్రయాణిస్తున్న మెజారిటీ ప్రయాణికులు ఇజ్రాయిల్ దేశానికి చెందినవారు. దీంతో ఇజ్రాయిల్ ప్రధానమంత్రి.. రక్షణ మంత్రి వెంటనే సమావేశం ఏర్పాటు చేశారు. ఇజ్రాయిల్ యుద్ధ విమానాలను రంగంలోకి దింపారు.అప్పటికే కత్తితో దాడి చేసిన కో పైలట్ ను పైలట్.. ప్రయాణికులు పట్టుకున్నారు. తీవ్ర గాయాలైన పైలెట్ కు విమానంలో ఉన్న ఒక వైద్యుడు ప్రాథమికంగా చికిత్స అందించారు. ఆ తర్వాత ప్రయాణికులలో ఇద్దరు ఇతర విమాన పైలట్ల సహాయంతో అభిమానాన్ని కిందికి మళ్లించారు. ఆ తర్వాత కోడ్ ను హైజాక్ నుంచి సాధారణ అత్యవసర పరిస్థితి కి మార్చారు.పైలట్ పై దాడికి పాల్పడి.. విమానాన్ని కూల్చాలి అనుకున్న ఒమన్ కో పైలెట్ విషయంలో అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా ఇజ్రాయిల్, ఒమన్ దేశాల మధ్య అంతగా సంబంధాలు లేవు. దీనికి తోడు అరబ్, గల్ఫ్ దేశాల నుంచి ఇజ్రాయిల్ వచ్చే విమానాల మీద తీవ్రస్థాయిలో పరిశీలన ఉంటుంది. అలాంటిది ఇజ్రాయిల్ దేశానికి వెళ్లే విమానంలో పైలట్ గా ఒమన్ జాతీయుడిని ఎలా అనుమతించారు అనే విషయం మీద అనేక రకాల సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇజ్రాయిల్ రవాణా శాఖ మంత్రి కూడా ఈ వే సందేహాలను వ్యక్తం చేశారు. విమానం కూల్చడానికి ముందుగానే ప్రణాళిక రూపొందించారని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అయితే ఒమన్ కో పైలట్ అసలు ఉద్దేశం ఏంటి.. అతని ప్రణాళిక ఏంటి.. దాడికి ఎందుకు ప్రయత్నించాడు అనే అంశాల మీద ఇంతవరకు క్లారిటీ లేదు. ఇతర వెనుక ఎవరైనా ఉన్నారా.. అందుకోసమే ఇదంతా చేశాడా అనే కోణంలో దర్యాప్తు జరుగుతోంది.పైలట్ మీద కత్తి దాడి జరిగిన తర్వాత విమానం తలకిందులుగా ప్రయాణించడం మొదలుపెట్టింది. కేవలం 29 సెకండ్ల కాలంలో 31 వేల అడుగుల ఎత్తులో ప్రయాణిస్తున్న విమానం ఏకంగా 17 అడుగులకు దిగింది. దాదాపు 14 అడుగుల మేర నిలువుగా కిందికి దిగింది. ఆ తర్వాత 19 వేల అడుగులకు చేరుకుంది. ప్రయాణ మార్గాన్ని పూర్తిగా మార్చుకుంది. జోర్డాన్ సరిహద్దుల సమీపంలో అసాధారణమైన రీతిలో తిరిగింది. మళ్లీ వెనక్కి వెళ్ళింది. గంట తర్వాత సౌదీ అరేబియాలోని తబూకు విమానాశ్రయంలో ల్యాండ్ అయింది.

# 22-A సమస్యల పరిష్కారంలో మరో కీలక అడుగు

మొదటి పేజీ తరువాయి

నాలా ప్రక్రియ పూర్తికాకపోవడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉండి, 22 ఎ, లో ఉన్న నివాస పట్టా భూముల విషయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు.

ఆయా దరఖాస్తులను రెవెన్యూ రికార్డులు, భూమి హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల ప్రకారం నాలా రుసుము మరియు ఇతర ప్రభుత్వ రుసుములను వసూలు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

ప్రజలు తమ భూముల రిజిస్ట్రేషన్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా పారదర్శకంగా, కాలపరిమితిలో ప్రక్రియ పూర్తి చేయాలని అర్హత ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, ప్రభుత్వానికి అమలు పురోగతిపై నివేదిక సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు తెలిపారు.

ఏళ్ల తరబడి తమ సొంత ప్లాట్లను విక్రయించుకోలేక, రుణాలు పొందలేక ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఈ నిర్ణయం వల్ల ఉపశమనం లభిస్తుందని మంత్రి గారు స్పష్టం చేశారు.

శనివారం నాడు రెవెన్యూ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి గారు మాట్లాడుతూ 22ఎ సమస్యల పరిష్కారం కోసం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులు క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యే విధంగా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాకోణంలో ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని అమలు చేయాల్సిన కనీస బాధ్యత అధికారులపై ఉందని ఆ బాధ్యతను అధికారులు సరైన విధంగా నిర్వర్తిస్తే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అన్నారు. ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి సూచనల మేరకు ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా అమలు చేయాలని ఆదేశించారు.

22-ఎ సమస్యలకు వరుస పరిష్కారాలు

గత నెల 16వ తేదీన శాసనసభ వేదికగా గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు 22-ఎ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలకు అనుగుణంగా సహచర మంత్రులతో చర్చించి 22ఎ తో ముడిపడి ఉన్న 10 నుంచి 12 సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

శాసనసభ లో ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చిన 24 గంటల్లోనే 22-ఎ సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేశాం. ఆ తర్వాత జి.ఓ 118 మరియు జి.ఓ 76లకు అనుగుణంగా స్పష్టమైన మెమోలను జారీ చేశాం. 22-ఎ జాబితాలో ఉన్నప్పటికీ జిహెచ్ఎంసీ, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులు కలిగిన ఇళ్లు, ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తూ ఇప్పటికే ఉత్తర్వులు ఇచ్చాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న అర్బన్ ల్యాండ్ సీలింగ్ దరఖాస్తుల పరిష్కారానికి స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశాం. ఆ క్రమంలోనే తాజాగా నాలా ప్రక్రియ పూర్తికాని పట్టా భూముల సమస్యకు పరిష్కారం చూపుతూ మెమో జారీ చేశామని వెల్లడించారు.

# ఈనెల 10 వ తేదీనుండి 18 వ తేదీ వరకు ఘనంగా బతుకమ్మ వేడుకలు

మొదటి పేజీ తరువాయి

ఈ బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని పండగ శోభ వచ్చేలా నగరంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మలను ఏర్పాటు చేయడమే కాకుండా పలు జంక్షన్ల కేంద్రాల వద్ద విధ్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్ దీపాలతో అలంకరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్ పై బతుకమ్మ ఆడేందుకు సమీపంలోని వాడలు, కాలనీలు, బస్తీల నుండి పెద్ద ఎత్తున మహిళలు వచ్చే అవకాశమున్నందున వారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, ట్యాంక్ బండ్ చిల్డ్రన్స్ పార్క్ లో ఉన్న బతుకమ్మ ఘాట్ తోపాటు నెక్లెస్ రోడ్డులో బతుకమ్మ ల నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని హెచ్ఎండీఏ, జీహెచ్ ఎంసీ అధికారులను సిఎస్ ఆదేశించారు. సాయంత్రం 5 నుండి రాత్రి 10 గంటల మధ్య ట్యాంకు బండ్ పై బతుకమ్మ ఉత్సవాలు జరుగుతున్నందున ట్రాఫిక్ డైవర్షన్, బారికేడింగ్, కనీస సౌకర్యాల ఏర్పాట్లను చేపట్టాలని తెలిపారు. అమరవీరుల స్మారక కేంద్రం నుండి ట్యాంక్ బండ్ వరకు ప్రత్యేకంగా బారికేడింగ్, లైటింగ్ సౌకర్యాలను కల్పించాలని సూచించారు. బతుకమ్మ జరిగే పది రోజుల పాటు రవీంద్ర భారతిలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అక్కడ కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని టూరిజం కేంద్రాలు, ప్రముఖ ప్రాంతాల్లోనూ బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించాలని అన్నారు.

బతుకమ్మ ఉత్సవాలను ప్రతిబింబించేలా ఈసారి ప్రత్యేక లోగోను రూపొందిస్తున్నామని వెల్లడించారు. డిసెంబర్ లో జరుగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను కూడా ఈ లోగోలో తెలియచేసే విధంగా రూపొందించనున్నట్టు తెలిపారు.

ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి వాణి ప్రసాద్, సీపీ హైదరాబాద్ వీసీ సజ్జనార్, పంచాయితీ రాజ్ కమిషనర్ దివ్య, జిహెచ్ ఎం సి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఆర్టీసీ ఎం.డి. నాగిరెడ్డి, సీపీ మల్కాజిగిరి బి.సుమతి, జాయింట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్), హైదరాబాద్ జోయెల్ డేవిస్, స్పెషల్ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ ముకుంద రెడ్డి, హార్టికల్చర్ కమిషనర్ షేక్ యాస్మీన్ బాషా, జలమందిలి అశోక్ రెడ్డి, టూరిజం డైరెక్టర్ రంజిత్ నాయక్, శిల్పారామం, సంస్కృతిక శాఖ డైరెక్టర్ ఎ. నర్సింహారెడ్డి, ప్రత్యేక అధికారి కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్థం కావాలి: ? మంత్రి శ్రీధర్ బాబు

మొదటి పేజీ తరువాయి

తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు. విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్ట్‌లు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. “ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం” ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. ‘యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ’ ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.

‘తెలంగాణ రైజింగ్ ఏ2047’ లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య కుదిరే నూతన భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతిపదికన మాత్రమే ఈ ‘రీచ్’ సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతలకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

# వనరుల సమీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి.

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసేలా ప్రభుత్వ భూములను సమర్థవంతంగా వినియోగించుకోవడం, వాటి విలువను పెంచడం, పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం, పర్యాటక రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదనపు ఆదాయ వనరులను గుర్తించడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించే ప్రాజెక్టులను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆస్తులు, భూముల ద్వారా గరిష్ఠ ఆర్థిక ప్రయోజనం పొందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

HILT పాలసీ లో ఎలాంటి అభ్యంతరాలు లేని పార్కులకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతతో పరిశీలించి త్వరితగతిన క్లియరెన్స్ ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. తద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయాన్ని వేగంగా సమీకరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. HILT పాలసీపై పరిశ్రమలకు మరింత అవగాహన కల్పించేందుకు ఆరు పార్కుల్లో మంత్రుల ఆధ్వర్యంలో రోడ్‌షోలు నిర్వహించాలని సీఎస్ సంజయ్ జాజు సూచించారు.

గ్లోబల్ సమ్మిట్‌కు 70--80 పర్యాటక ప్రాజెక్టులు

పర్యాటక రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రాజెక్టులను సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గతంలో తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను వివరించినప్పుడు సుమారు రూ.30 వేల కోట్ల విలువైన పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రాబోయే గ్లోబల్ సమ్మిట్‌లో దేశ, విదేశీ పెట్టుబడిదారులకు తెలంగాణ పర్యాటక రంగంలోని అవకాశాలను సమగ్రంగా ప్రదర్శించేందుకు 70--80 సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (DPR\T) సిద్ధం చేయాలని సీఎస్ కి సూచించారు. పర్యాటక ప్రాజెక్టులకు అనువైన ప్రాంతాలను గుర్తించి, పెట్టుబడిదారులను ఆకర్షించేలా ప్రతిపాదనలు రూపొందించాలని భట్టి ఆదేశించారు.

కోటలు, టైగర్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

?రాష్ట్రంలోని చారిత్రక కోటలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు [illegible] విధానంలో 11 కోటలకు బిడ్లు ఆహ్వానించినట్లు అధికారులు తెలిపారు. టైగర్ టూరిజం కార్యక్రమాలను వెంటనే ప్రారంభించాలని భట్టి ఆదేశించారు. నిజాంసాగర్‌లోని నిజాం గెస్ట్‌హౌస్‌ను పర్యాటక అవసరాలకు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. రాష్ట్రంలో పర్యాటక మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు కారవాన్ పార్కుల ఏర్పాటుపై దృష్టి సారించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. ఇందుకోసం గుర్తించిన మూడు జిల్లాల కలెక్టర్ల సహకారంతో ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాన పర్యాటక ప్రాజెక్టుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, ప్రతి ప్రాజెక్టు ఎప్పటికి పూర్తవుతుంది, ఎప్పటికి పర్యాటకులకు అందుబాటులోకి వస్తుందనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, వివిధ శాఖల ఉన్నత అధికారులు శ్రీ శశాంక, శ్రీ కృష్ణ భాస్కర్, శ్రీ ఇలంబర్తి, శ్రీ నిఖిల్ చక్రవర్తి, శ్రీ లోకేష్ కుమార్, శ్రీ కృష్ణ ఆదిత్య, శ్రీ సర్ఫరాజ్ అహ్మద్ మరియు అధికారులు పాల్గొన్నారు

# పేదల సొంతింటి కలకు తాన్లా ఫౌండేషన్ అండ

**సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో రూ.300 కోట్లతో 5,000 ఇళ్ల నిర్మాణం**

**దసరా పండుగ రోజున భూమిపూజ**

**-- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**





సత్తుపల్లి: పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రజా ప్రభుత్వం ఒకవైపు కృషి చేస్తుండగా.. దాతృత్వ సంస్థలు కూడా ప్రభుత్వంతో చేతులు కలపడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాల్లోని నిరుపేదల కోసం తాన్లా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉదయ్ కుమార్ రెడ్డి సొంత నిధులతో సుమారు రూ. 300 కోట్ల అంచనా వ్యయంతో 5,000 ఇళ్లను ఉచితంగా నిర్మించి ఇవ్వడానికి ముందుకు వచ్చారని తెలిపారు.

దసరా పండుగ రోజున ఈ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు.

సత్తుపల్లి మండలం బేతుపల్లి గంగారం గ్రామంలో తాన్లా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం, ల్యాబొరేటరీలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా రక్తపరీక్ష చేయించుకున్నారు. అనంతరం వైద్యాధికారులు, రోగులతో మాట్లాడి అక్కడ అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే, తాన్లా ఫౌండేషన్ తరపున ఉదయ్ కుమార్ రెడ్డి తన సొంత నిధులతో 5,000 ఇళ్లను నిర్మించి ఇస్తానని ముందుకు వచ్చారని తెలిపారు.

పేద కుటుంబాలకు కేవలం ఇల్లు మాత్రమే కాకుండా ఆత్మగౌరవంతో జీవించే సొంత చిరునామా కల్పించాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని త్వరితగతిన ముందుకు తీసుకెళ్లేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ సమన్వయంతో అర్హులైన నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పేదలకు ఆరోగ్యం.. అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి

నారాయణపురం గ్రామంలో పేదలకు ఉచితంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు శ్రీ షిరిడి సాయి జనమంగళం ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్రమాణాలతో క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణం జరుగుతోందని మంత్రి తెలిపారు.

# సత్తుపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి**

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 3:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ శంకుస్థాపన చేశారు. పట్టణంలోని ద్వారకాపురి కాలనీ 12వ వార్డు, గాంధీనగర్ 14వ వార్డు, గుడిపాడు రోడ్ 1వ వార్డు ప్రాంతాల్లో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. సత్తుపల్లి పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న రహదారులు, డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపేలా పనులు చేపడుతున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.



ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. సత్తుపల్లి మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, అభ్యర్థనలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ముఖ్యంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.



“సత్తుపల్లి పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతి వార్డులో ప్రజలకు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు అందించడమే లక్ష్యం. చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్, ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్‌బాబు, మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## అందోల్నియోజకవర్గం లోని అన్ని మండలాలకు అందోల్- జోగిపేట, టౌన్ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 03 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పిసిసి) అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ, సూచనల మేరకు అందోల్ నియోజకవర్గం లోని అన్ని మండలాలకు, అందోల్- జోగిపేట, టౌన్ కాంగ్రెస్ పార్టీ, నూతన అధ్యక్షులుగా నియమిస్తూ ఉత్తరులు జారీ చేశారు, అందోల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, శ్రీ గంగాధర్ అశోక్, మునిపల్లి మండల అధ్యక్షులుగా, శ్రీ లింగన్న గారి సతీష్ కుమార్, చౌటకూరు మండల అధ్యక్షులుగా, శ్రీ బోడపట్ల గణేష్, పుల్కల్ మండల అధ్యక్షులుగా, శ్రీ మల్లన్న గారి దుర్గారెడ్డి, రాయికోడు మండల అధ్యక్షులుగా, పట్లోళ్ల కేదార్నాథ్, వట్టిపల్లి మండల అధ్యక్షులుగా, శ్రీ వజనాల విశ్వాస్,





అందోల్- జోగిపేట టౌన్ అధ్యక్షులుగా శ్రీ డి,జి, వెంకటేశం, రేగోడు మండల అధ్యక్షులుగా, శ్రీ ఎస్,దిగంబర్ రావు, అల్లాదుర్గ్ మండల అధ్యక్షులుగా, శ్రీ కొప్పుల శేషారెడ్డి, టేక్మాల్ మండల అధ్యక్షులుగా, శ్రీ పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, గార్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల టౌన్ అధ్యక్షులుగా నియమితులైన పార్టీ నాయకులతో, మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డి లోని తన నివాసంలో, మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు, ఈసందర్భంగా వారికి నియమాక పత్రాలను అందజేశారు, కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతంపై చర్చించారు, ప్రభుత్వం అమలు చేస్తున్న, ప్రజా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున, తీసుకెళ్లడం పై చర్చించారు......

## బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ సికింద్రాబాద్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం మరియు మహిళలను ఆరోగ్య పరిరక్షణ వైపు ప్రోత్సహించడం లక్ష్యంగా పింక్ అక్టోబర్ ? బ్రెస్ట్ క్యాన్సర్ అవేర్‌నెస్ మంత్ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. భారతదేశంలో మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే క్యాన్సర్ రొమ్ము క్యాన్సర్. ప్రతి సంవత్సరం దేశంలో రెండు లక్షలకుపైగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం, సమయానికి చికిత్స పొందడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు మెడికవర్ హాస్పిటల్స్ ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ప్రమాద కారకాలు, క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం, కుటుంబ చరిత్ర మరియు వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా పరీక్షలు చేయించుకోవడం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. వైద్య నిపుణులు పాల్గొన్న వారితో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ నివేద్ రావు బల్మూరి, సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్ట్ మరియు రోబోటిక్ సర్జన్, మెడికవర్ హాస్పిటల్స్, సికింద్రాబాద్ మాట్లాడుతూ, “మహిళల్లో అత్యంత సాధారణంగా కనిపించే క్యాన్సర్లలో రొమ్ము క్యాన్సర్ ఒకటి. అయితే దీనిని ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స ఫలితాలు ఎంతో మెరుగ్గా ఉంటాయి. 40 ఏళ్లు దాటిన మహిళలు, అలాగే కుటుంబంలో రొమ్ము క్యాన్సర్ చరిత్ర ఉన్నవారు తమ వైద్యుల సలహా మేరకు తగిన స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. రొమ్ములో ఏవైనా కొత్త మార్పులు లేదా అసాధారణ లక్షణాలు గమనించిన వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత ముఖ్యమైన విషయం. ముందస్తు నిర్ధారణ ప్రాణాలను కాపాడగలదు” అని తెలిపారు.

# ఖైరతాబాద్ బరిలో కవిత పార్టీ

హైదరాబాద్, అక్టోబరు 3 ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ వైపు అడుగులు వేసి ఎంపీగా పోటీ చేయడంతో ముంచుకొచ్చిన ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నిక తెలంగాణ రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది.

బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి, తెలంగాణ రక్షణ సేన పేరుతో కొత్త రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కల్వకుంట్ల కవిత.. ఈ ఉపఎన్నిక బరిలో తమ పార్టీ అభ్యర్థిని దించుతామని ప్రకటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. పార్టీ ఆవిర్భావం తర్వాత ఎదుర్కొంటున్న తొలి ఎన్నిక కావడంతో, ఖైరతాబాద్ పోరు తెలంగాణ రక్షణ సేనకు తమ ఉనికిని, క్షేత్రస్థాయి ప్రాభవాన్ని చాటుకునే ప్రతిష్టాత్మక పరీక్షగా మారనుంది. ఈ ఎన్నికల్లో కవిత నేతృత్వంలోని పార్టీకి ప్రధాన లక్ష్యం తక్షణమే సీటును కైవసం చేసుకోవడం కాకపోవచ్చు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీల త్రిముఖ పోటీ మధ్య తమకంటూ ఒక ప్రత్యేకమైన ఓటు బ్యాంకు, సిద్ధాంతపరమైన స్థానం ఉందని నిరూపించుకోవడమే ఆమె అసలైన పొలిటికల్ ఎజెండాగా కనిపిస్తోంది. బిఆర్ఎస్ నుంచి సస్పెన్షన్, జైలు జీవితం తర్వాత "సామాజిక తెలంగాణ" నినాదంతో ప్రజాక్షేత్రంలోకి వచ్చిన కవితకు.. హైదరాబాద్ నడిబొడ్డున జరిగే ఈ బైపోల్ ఒక లిట్మస్ టెస్ట్ లాంటిది. ప్రధాన పార్టీలకు గట్టి పోటీ ఇస్తూ ఓట్లను రాబట్టగలిగితే, రాబోయే స్థానిక సంస్థలు, అసెంబ్లీ ఎన్నికలకు టీఆర్ఎస్‌ను ఒక ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టే అవకాశం దక్కుతుంది. ఖైరతాబాద్ నియోజకవర్గ భౌగోళిక, సామాజిక సమీకరణాలు పరిశీలిస్తే ఇక్కడ పోటీ అత్యంత విలక్షణంగా ఉంటుంది. బస్తీల్లో ఉండే శ్రామిక వర్గాలు, కాలనీల్లోని మధ్యతరగతి ప్రజలు, హైటెక్ ఉద్యోగులు, ఐటీ ఆధారిత వ్యాపారవేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో ఇక్కడ నివసిస్తున్నారు. స్థానికంగా మంచి పట్టుండి, ప్రజాదరణ పొందిన బలమైన అభ్యర్థిని బరిలోకి దించగలిగితే తెలంగాణ రక్షణ సేన ప్రధాన పార్టీల గెలుపోటములను ప్రభావితం చేసే కింగ్ మేకర్ గా మారే ప్రభావం చూపుతుంది. ఈ ఉపఎన్నికలో కవితకు అతిపెద్ద ప్లస్ పాయింట్ మహిళా ఓటర్లు. గతంలో తెలంగాణ జాగృతి ద్వారా బతుకమ్మ సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడం, మహిళా సాధికారత అంశాలపై పోరాడటం వల్ల తెలంగాణ సెంటిమెంట్‌తో పాటు మహిళల్లో ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఖైరతాబాద్ వంటి అర్బన్ నియోజకవర్గంలో మహిళా ఓటర్ల శాతం అధికంగా ఉండటం వల్ల.. ధరల పెరుగుదల, ఉచిత బస్సు ప్రయాణాల అమలు తీరు, మహిళా భద్రత, స్థానిక సమస్యలపై ఆమె చేసే ప్రచారం మహిళల ఓట్లను ఆకర్షించే అవకాశం ఉంది. ఇది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్‌ల సాంప్రదాయ మహిళా ఓటు బ్యాంకుకు గండికొట్టడం ఖాయంగా కనిపిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మార్పు , రాజ్యాంగబద్ధమైన పదవుల దుర్వినియోగంపై కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఒక గుర్తుపై గెలిచి మరొక పార్టీకి వెళ్లడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమే అని ప్రజల్లోకి తీసుకెళ్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, బీఆర్ఎస్ అంతర్గత ఒప్పందాలను ఒకేసారి ఎండగట్టే వ్యూహాన్ని అమలు చేస్తున్నారు.

రాజధాని నగరంలోని విద్యావంతులు, తటస్థ ఓటర్లు ప్రజాస్వామ్య సూత్రాలకు ప్రాధాన్యమిస్తే.. ఈ రాజకీయం కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ తలనొప్పిగా మారనుంది. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఫలితాల సరళిని తలకిందులు చేసే శక్తి తెలంగాణ రక్షణ సేనకు ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. గెలుపు ఓటముల కంటే కూడా, తాము సాధించే ఓట్ల శాతమే భవిష్యత్తులో తెలంగాణ రాజకీయాల్లో కవిత ఎంతవరకు ప్రభావం చూపగలరనే దానికి ప్రామాణికంగా నిలుస్తుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సైతం కవిత అభ్యర్థిత్వం , వ్యూహాలను తేలిగ్గా తీసుకోలేక, తమ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కొత్త సమీకరణాలను తెరపైకి తెచ్చే పరిస్థితి ఏర్పడింది.

# సెల్ఫ్ గోల్ రాజకీయంతో రేవంత్

హైదరాబాద్, అక్టోబరు 3 కాంగ్రెస్ పార్టీ మత రాజకీయాలను సరికొత్త కోణంలో ప్రమాదకరమైన ప్రయోగానికి తెరలేపింది. భారతీయ జనతా పార్టీ సుదీర్ఘకాలంగా నిర్మించుకుంటూ వస్తున్న హిందూత్వ ఓటు బ్యాంకుకు విరుగుడు కనిపెట్టే ఆత్రుతలో కాంగ్రెస్ నాయకత్వం సరికొత్త వివాదాలకు ఆజ్యం పోస్తోంది. గతంలో పార్లమెంట్‌లో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ భగవాన్ శివుడి చిత్రాన్ని ప్రదర్శిస్తూ ప్రసంగించిన బాటలోనే.. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా ఆర్య-ద్రావిడ వాదాన్ని, శైవం-వైష్ణవం పేరిట దేవుళ్లకే వర్గ విభజన ఆపాదిస్తూ చేసిన వ్యాఖ్యలు జాతీయ స్థాయిలో తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. రాముడు ధనికుల దేవుడు-శివుడు పేదల దేవుడు.. ఉత్తరాది వారు ఆర్యులు, దేవుడిగా రాముడిని కొలిస్తే.. దక్షిణాది వారమైన మేము ద్రావిడులం, శివుడిని ఆరాధిస్తాం.. బీజేపీ రాముడిని హైజాక్ చేసింది అంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. ఒక రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి, హిందూ దైవ కుటుంబంలో అత్యంత ప్రధానమైన శ్రీరాముడు, పరమశివుడి మధ్య పేద, ధనిక అంతరాలను సృష్టించడం విపరీతమైన విమర్శలకు దారితీసింది. ప్రాంతీయంగా ద్రావిడ వాదాన్ని ఎత్తుకుంటూనే, దైవ భావనకు కూడా వర్గ పోరాటం రంగు పులమడం కాంగ్రెస్ అనుసరిస్తున్న నూతన రాజకీయ విభజన వ్యూహానికి నిదర్శనమని భావిస్తున్నారు. హిందూ సమాజంలో చారిత్రకంగా అనేక సంప్రదాయాలు ఉన్నప్పటికీ, రాముడు, శివుడు అనే వ్యత్యాసాలు లేకుండా హరిహరులు గా కలిసి ఆరాధించే సంస్కృతి భారత్‌లో ఉంది. ముఖ్యంగా తెలంగాణలోనే భద్రాచలం శ్రీరాముడిని దక్షిణ అయోధ్య గా, వేములవాడ రాజరాజేశ్వర స్వామిని దక్షిణ కాశీ గా సమానంగా పూజిస్తారు. ఇటువంటి పుణ్యక్షేత్రాలు ఉన్న ప్రాంతానికి చెందిన నేతలే.. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుళ్లను ఉత్తర-దక్షిణ భాగాలుగా, ధనిక-పేద వర్గాలుగా విభజించడం వెనుక క్షేత్రస్థాయిలో రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటం స్పష్టంగా కనిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా హిందూ సంప్రదాయాలను విభజించడం ద్వారా బీజేపీ ఏకీకృత హిందూ ఓటు బ్యాంకును దెబ్బతీయవచ్చని అంచనా వేస్తోంది. వ్యూహాత్మకంగా కాంగ్రెస్ వేస్తున్న ఈ అడుగులు ఆ పార్టీకే రివర్స్ అయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ఇటువంటి భక్తి, విశ్వాసాల కేంద్రంగా జరిగే విభజన రాజకీయాలు ఆఖరికి బీజేపీకే రాజకీయంగా అత్యధిక ప్రయోజనాన్ని చేకూరుస్తాయి. హిందూ దేవుళ్లను రాజకీయాల్లోకి లాగి, వారిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా మెజారిటీ ఓటర్లలో కాంగ్రెస్‌పై ప్రతికూల భావన ఏర్పడేలా చేయడం బీజేపీకి చాలా సులభమవుతుంది. ఈ వ్యాఖ్యలను అస్త్రంగా చేసుకుని కాంగ్రెస్ హిందూ వ్యతిరేక సిద్ధాంతాన్ని, నకిలీ సెక్యులరిజాన్ని పాటిస్తోంది అని బీజేపీ విస్తృతంగా ప్రచారం చేయడానికి అవకాశం లభిస్తుంది. హిందుత్వను నేరుగా ఎదుర్కోలేక, దానిని ముక్కలు చేసేందుకు శివుడు లబ రాముడు, ఉత్తరాది లబ దక్షిణాది సమీకరణాలు తేవడం వల్ల పోలరైజేషన్ జరుగుతుంది. ఇది కాంగ్రెస్‌కు ఉన్న లౌకిక లేదా తటస్థ ఓటర్లను కూడా దూరం చేసే ప్రమాదం ఉంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన ప్రాచీన ధార్మిక క్షేత్రాల పునర్నిర్మాణం ద్వారా ఇప్పటికే ఉత్తర-దక్షిణ తేడా లేకుండా విశ్వాసులలో స్థానం సంపాదించుకుంది. కాబట్టి దేవుళ్లను విభజించే యత్నం సాధారణ భక్తుల్లో ఆగ్రహాన్ని కలిగించి, ఓట్ల రూపంలో బీజేపీ వైపే దారితీస్తుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. కాంగ్రెస్ పార్టీ హిందూత్వ సిద్ధాంతానికి విరుగుడుగా తెస్తున్న ఈ విభజన కౌంటర్ వ్యూహం సెల్ఫ్ గోల్ అయ్యే అవకాశాలే ఎక్కువ. విశ్వాసాలను రాజకీయం చేసి, దేవుళ్లకు వర్గ భేదాలు ఆపాదించడం ద్వారా కాంగ్రెస్ సాధించేదనకంటే కోల్పోయేదే ఎక్కువని తెలంగాణ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. భావజాల పరంగా స్పష్టమైన ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచకుండా, ఇటువంటి సున్నితమైన అంశాలను కెలికితే అది బీజేపీ నేతృత్వంలోని పోలరైజేషన్ వ్యూహానికి మరింత నెయ్యి పోసినట్లే అవుతుందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది.

# నగరంలో మంత్రి నారాయణ ఆకస్మిక పర్యటన



విజయవాడ మంత్రి నారాయణ విజయవాడ నగరంలో ఆకస్మికంగా పర్యటించారు. వర్షం కారణంగా నీరు నిలిచిపోయిన ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి నీటి తొలగింపు పనులను పర్యవేక్షించారు. నోవాటెల్ ఎదురుగా జాతీయ రహదారిపై ప్రతిసారి నీరు నిలిచిపోతుండడం పై ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్రకు ఆదేశాలు ఇచ్చారు.

# ప్రతి ఒక్క పేదవారికి సొంత ఇంటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం.

**మంత్రి పొంగిలేటి శ్రీనివాసరెడ్డి.**

**పేదలకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ చేసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్.**

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 3:** తల్లాడ మండలం పాత పినపాక గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.



తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీమతి డా. మట్టా రాగమయి దయానంద్ ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి స్థలం, ఇల్లు అనేది ఎంతో ముఖ్యమైన కల అని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



ప్రజల అవసరాలను గుర్తించి వారికి భూమి, ఇళ్ల స్థలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఇంటి స్థలాల పట్టాలు పొందిన ప్రతి కుటుంబం ఆ స్థలంలో సొంత ఇంటిని నిర్మించుకుని ఆత్మగౌరవంతో జీవించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు.

ఈ సందర్భంగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ.. పాత పినపాక గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాల పట్టాలు అందజేయడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

"సొంత ఇంటి స్థలం ఉండాలనే పేద ప్రజల కలను సాకారం చేయడమే మా ప్రభుత్వ లక్ష్యం. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేలా నిరంతరం కృషి చేస్తున్నాం" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు, పేద కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పాత పినపాక గ్రామ ప్రజలకు అవసరమైన ఇతర సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాజీ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్, సబ్ కలెక్టర్ అజయ్, కల్లూరు ఏఎంసి చైర్మన్ నీరజా ప్రభాకర్,తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జి. లక్ష్మారెడ్డి , జిల్లా, పట్టణ, మండల స్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, అధికారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# భారత్ దెబ్బ... అగ్రరాజ్యం అబ్బ...

న్యూఢిల్లీ, అక్టోబరు 3, అంతరిక్షంలోనే ఉపగ్రహాలను కూల్చివేసే క్షిపణి టెక్నాలజీ కలిగిన ప్రపంచంలోని నాలుగు దేశాల్లో భారత్ ఒకటి. భారత్ 2019లో అమెరికా, చైనా, రష్యాల సరసన చేరింది. అయితే, మార్చి 2019లో చేపట్టిన ఈ ప్రయోగం అగ్రరాజ్యం అమెరికాను కలవరానికి గురిచేసింది అని ఆ దేశ మాజీ నిఘా అధికారి తాజాగా వెల్లడించారు.

ఆయన ఓ పాడ్‌కాస్ట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. భారత్ చేపట్టిన యాంటి శాటిలైట్ మిసైల్ పరీక్ష సమయంలో ఆందోళన చెందినట్టు తెలిపారు. పోఖ్రాన్-2 అణు పరీక్షలతో అమెరికాతో ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేసిన భారత్.. అణుశక్తిలో తాము ఏమాత్రం తీసిపోమని నిరూపించింది. ఇది జరిగిన దాదాపు 28 ఏళ్ల తర్వాత అగ్రరాజ్యానికి భారత్ అలాంటి సర్‌ప్రైజ్ ఇచ్చింది.

మార్చి 27, 2019 భారత్ చేపట్టిన 'మిషన్ శక్తి' ( యాంటీ శాటిలైట్ క్షిపణి ప్రయోగం అమెరికా నిఘా వర్గాలను తీవ్రగ్భ్రాంతికి గురిచేసింది. దీనికి సంబంధించిన వివరాలను అమెరికా వాయుసేన మాజీ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ డేవిడ్ గ్రుష్ తాజాగా ప్రముఖ పాడ్‌కాస్టర్ జో రోగన్ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

అప్పట్లో నేషనల్ రీకాన్సార్స్ ఆఫీస్ ఆపరేషన్స్ సెంటర్‌లో విధులు నిర్వహిస్తున్న గ్రుష్.. ఆ సమయంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. "ఇది ఒక విచిత్రం... 2019లో ఎవరూ ఊహించని విధంగా భారత్ నిర్వహించిన క్షిపణి పరీక్ష వారి ఉపగ్రహాలలో ఒకదానిని తాకింది.. ఈ విషయం గురించి వారు మాకు ముందు తెలియజేయలేదు" అని ఆయన అన్నారు. ఒడిశా తీరంలో భారత్ క్షిపణి పరీక్షకు సంబంధించి నోటీసు జారీ చేసినప్పటికీ.. అది ఉపగ్రహాన్ని పేల్చివేసే 'యాయి' క్షిపణి అని అమెరికా ఊహించలేకపోయింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతిని ఉద్దేశించి ప్రసంగించే వరకు దీనిపై ఎవరికీ అవగాహన లేదు. ఈ ప్రయోగం వల్ల ఏర్పడిన అంతరిక్ష వ్యర్థాల నుంచి తమ నిఘా ఉపగ్రహాలకు ప్రమాదం పొంచి ఉందేమోనని ఎన్ఆర్వో అధికారులు తీవ్ర ఆందోళన చెందారని ఆయన అన్నారు. వెంటనే వ్యర్థాల విస్తరణను లెక్కించి, అమెరికా ఉపగ్రహాల మార్గాన్ని మార్చాల్సిన అవసరం ఉందో లేదో చూడాలని విశ్లేషకులను ఆదేశించినట్లు గ్రుష్ తెలిపారు.

ప్రయోగంలో భాగంగా భారత్ తన ఉపగ్రహం 'మైక్రోశాట్-ఆర్' ను నింగిలోనే విజయవంతంగా కూల్చివేసింది. దీంతో అంతరిక్షంలోనే ఉపగ్రహాలను ధ్వంసం చేసే వ్యూహాత్మక సామర్థ్యం కలిగిన అమెరికా, రష్యా, చైనాల సరసన భారత్ చేరింది. ఈ ప్రయోగం తక్కువ భూకక్ష్యలో జరిగిందని, ఏర్పడిన వ్యర్థాలు కొన్ని వారాల్లోనే నశిస్తాయని, అంతరిక్షంలో ఆయుధాల పోటీలో పాల్గొనే ఉద్దేశం భారత్‌కు లేదని విదేశాంగ శాఖ అప్పట్లోనే స్పష్టం చేసింది. భారత్ క్షిపణి ప్రయోగంపై నిఘా పెట్టేందుకు డియెగో గార్సియా బేస్ నుంచి అమెరికా వైమానిక దళ విమానం బంగాళాఖాతం మీదుగా వచ్చిందని 'ఎయిర్‌క్రాఫ్ట్ స్పాట్స్' నివేదించింది. అయితే తమ ఆస్తులేవీ భారత్‌పై గూఢచర్యం చేయలేదని అమెరికా రక్షణ శాఖ అప్పట్లో ప్రకటించినప్పటికీ.. గ్రుష్ చెప్పిన విషయాలను బట్టి ఈ ప్రయోగం అమెరికాకు పూర్తిగా ఊహించని షాక్ అని స్పష్టం చేస్తున్నాయి.

## ఢిల్లీ-బీహార్ వోల్వో బస్సు-ట్రక్ ఢీ.. నలుగురు మృతి

: ఢిల్లీ నుంచి బీహార్‌కు వెళ్తున్న వోల్వో బస్సు ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిధిలో గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌వేపై అక్టోబర్ 2న ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీ నుంచి బీహార్‌కు బయలుదేరిన వోల్వో బస్సును ఎదురుగా వచ్చిన ట్రక్ బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు బస్సు ముందు భాగంతో పాటు ఎడమ వైపు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనలో నలుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు.

# ఫాం హౌస్ సర్వేపై ఉత్కంఠ

హైదరాబాద్, అక్టోబరు 3, కేసీఆర్ ఎర్రవల్లి ఫాంహౌస్ భూముల అంశం కేంద్రబిందువుగా మారింది. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి, వెలికట్ట గ్రామాల పరిధిలో కేసీఆర్ ఫాంహౌస్‌ను ఆనుకుని ఉన్న భూముల సర్వే ప్రక్రియ పూర్తికావడం చర్చనీయాంశమైంది. రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ఈ సమగ్ర సర్వే నివేదిక సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతికి చేరింది. దీంతో.. ప్రభుత్వం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోబోతుందనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

కేసీఆర్ ఫాంహౌస్ లో అసైన్డ్ ల్యాండ్స్ ఉన్నాయని.. వాటిపై 30 రోజుల్లోగా సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఆదేశించారు. మర్కూక్ మండల పరిధిలోని భూముల లెక్కలు తేల్చాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం కదిలింది. ఎర్రవల్లి సర్వే నంబర్ 325 పరిధిలోని సుమారు 388 ఎకరాలు, వెలికట్ట సర్వే నంబర్ 271 భూములపై అధికారులు సర్వే నిర్వహించారు. శాటిలైట్ మ్యాపింగ్, జియో ట్యాగింగ్, డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి హద్దులను నిర్ధారించారు. ఈ సర్వేలో భాగంగా ఎర్రవల్లిలో 244 మందికి, వెలికట్టలో 118 మందికి పైగా నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే రాజకీయంగానే కాకుండా స్థానికంగానూ అనేక మలుపులు తిరుగుతోంది. ముఖ్యంగా శివారు వెంకటాపూర్ గ్రామస్థులు అధికారుల ముందుకొచ్చారు. తమ గ్రామానికి చెందిన సుమారు 180 ఎకరాల భూములు ఎర్రవల్లి సర్వే నంబర్ 325లో కలిసిపోయాయని, పాత రికార్డుల ఆధారంగా న్యాయం చేయాలని వారు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. మరోవైపు, దశాబ్దాలుగా ఆ భూములను సాగు చేసుకుంటున్న చిన్న సన్నకారు రైతులు తమ పట్టా పాస్‌బుక్కులు చూపించినప్పటికీ, ప్రభుత్వ తాజా నిర్ణయాలు తమను ఏ విధంగా ప్రభావితం చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. పదేళ్లపాటు సీఎంగా ఉన్న కేసీఆర్ ఫాంహౌస్ చుట్టూ ఉన్న భూముల్లో ప్రభుత్వ, అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఒకవేళ ఈ సర్వే నివేదికలో భూ ఆక్రమణలు జరిగినట్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా భూ బదలాయింపులు జరిగినట్లు తేలితే, అది కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌ను ఇరుకున పెట్టే అవకాశం ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ దీనిని రాజకీయ అస్త్రంగా మలుచుకుంటుంది. అయితే రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ సర్వే చేపట్టారని గులాబీ శ్రేణులు మండిపడుతున్నాయి. కలెక్టర్ అందజేయనున్న ఈ తుది నివేదికను ప్రభుత్వం పరిశీలించి ఎలాంటి చర్యలకు ఉపక్రమిస్తుందనేది ఆసక్తి రేపుతోంది. కేసీఆర్ కు నోటీసులు జారీ చేసి విచారణకు పిలిచే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ అదే జరిగితే రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు మరో మలుపు తిరిగే అవకాశముంది.

## హనుమంతుడే కాపాడాడు



హైదరాబాద్, అక్టోబరు 3, దుబాయ్ విమానంలో జరిగిన హింసాత్మక ఘటనలో వీరోచితంగా పోరాడి, గాయపడిన భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ ను ప్రధాని మోదీ ఫోన్లో పరామర్శించారు. యూఏఈలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మచ్చర్ తో మోదీ వీడియో కాల్ లో మాట్లాడారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాక్ పిట్ లో తనకు ఎదురైన పరిస్థితిని మచ్చర్ ప్రధాని మోదీకి వివరించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. “అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో చూపించిన సమయ స్ఫూర్తి, ధైర్యం అభినందనీయం. మీ ప్రాణం కంటే ప్రయాణికుల భద్రత కోసం పోరాడిన మీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. త్వరగా కోలుకోవాలని యావత్ భారత్ ప్రార్థిస్తోంది. భారతీయులు ఇతరుల ప్రాణాలు తీసేవారు కాదు. ఇతరులను రక్షించడం కోసం తమ ప్రాణాలను కూడా ఫణంగా పెట్టడానికి సిద్ధపడతారని మన దేశం ఇప్పుడు గర్వంగా చెప్పుకుంటుంది” అని స్మిత్ తో మోదీ అన్నారు. మరో వైపు ప్రధాని మోదీయే నేరుగా ఫోన్ చేయడంపై కెప్టెన్ స్మిత్ మచ్చర్ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా మచ్చర్ మాట్లాడుతూ “మీరు నాకు అత్యంత ఆరాధనీయులు. మీ నుంచి ఫోన్ రావడం గర్వంగా వుంది. కలలో కూడా నేను ఊహించలేదు. అనుకోని పరిస్థితులు, విపత్కర పరిస్థితుల్లో హనుమాన్ చాలీసా పఠిస్తా. కాక్ పిట్ లో ఘర్షణ సమయంలోనూ హనుమాన్ చాలీసాయే పఠించా. ఆ సమయంలో నేను గాయపడినా, ఆలోచించలేదు. ఎవరి ప్రాణాలూ పోవద్దని మాత్రం దేవుడ్ని ప్రార్థించా. నేను ఎలాగైనా లేవాలి. లేదంటే నాతో పాటు అందరూ మరణిస్తారని గట్టిగా భావించా” అంటూ మోదీకి వివరించారు.

## అమెరికాలో విషాదం.. అనారోగ్యంతో నల్గొండ యువతి మృతి



మిర్యాలగూడ : ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగు యువతి తీవ్ర అనారోగ్యానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. క్యాన్సర్ మహమ్మారితో పోరాడి కన్నుమూసింది. నల్గొండ జిల్లా వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పీఏసీఎస్ సల్కునూరు మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి కందిమల్ల లక్ష్మిరెడ్డి, పద్మ దంపతుల చిన్న కుమార్తె మాన్వితా రెడ్డి (26) హైదరాబాద్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. ఉన్నత చదువుల కోసం 2023లో అమెరికా వెళ్లింది. స్నేహితులతో కలిసి ఉంటూ ఎంఎస్ పూర్తి చేసింది. ఈ క్రమంలో ఆమె అనారోగ్యానికి గురైంది. సెప్టెంబర్ 4న అకస్మాత్తుగా తీవ్ర గొంతు నొప్పితో అనారోగ్యానికి గురికావడంతో స్నేహితులు ఆమెను బాల్టిమోర్‌లోని దవాఖానలో చేర్పించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు నాలుగో దశ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. సెప్టెంబర్ 13న చికిత్స కోసం దవాఖానలో ఇన్ పేషెంట్‌గా చేర్చుకున్నారు. అప్పటి నుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్టోబర్ 1న మాన్వితారెడ్డి మృతిచెందింది.

## ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య

### వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలో విషాద ఘటన



వికారబాద్ మాటుగూడలో కుటుంబ కలహాల నేపథ్యంలో శుక్రవారం ఉదయం భర్త రాజుతో గొడవ పడి కూతురు జనశ్రీ (8), కుమారుడు సాకేత్ (4)లను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయి సోమనుర్తి శివారులోని వ్యవసాయ బావిలో దూకి శవమై భార్య మమత (30) కనిపించింది. ఇద్దరి మృతదేహాలను బయటకు తీయగా, సాకేత్ కోసం పోలీసులు గాలిస్తునన్నారు.

# శ్రీసిటీలో ఘోర ప్రమాదం.. నలుగురు మృతి

తిరుపతి తిరుపతి జిల్లా శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో శనివారం భారీ పేలుడు సంభవించింది. టిల్ హెల్త్కేర్ పరిశ్రమలో బాయిలర్ ఒక్కసారిగా పేలడంతో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. పరిశ్రమలోని నిర్మాణాలు, ఇనుప సామగ్రి, పైపులు, ఇతర పరికరాలు దెబ్బతిన్నాయి. ఘటనాస్థలంలో భారీగా శిథిలాలు చెల్లాచెదురుగా పడ్డాయి. శిథిలాల కింద పలువురు కార్మికులు చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో మృతిచెందిన వారు, గాయపడిన వారి వివరాలు, వారి స్వస్థలాలు, క్షతగాత్రుల పరిస్థితిపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది. అలాగే బాయిలర్ పేలుడుకు గల అసలు కారణం ఏమిటన్న దానిపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.

# చేనేత వస్త్రప్రదర్శనను ప్రారంభించిన సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన

హైదరాబాద్ మన చేనేతకళలను మనమే ప్రోత్సహించాలని, చేనేత వస్త్రాలు ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాద్యతగా ధరించాలని సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజన అన్నారు. శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరుతో ఏర్పాటుచేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. దసరా, బతుకమ్మ, దీపావళితో పాటు పలు శుభకార్యాలకు అనువుగా ఇక్కడ చేనేత కళాకారుల చీరలు కొలువుదీరాయని, చేనేత కళాకారులకు మరింత ఆదరణ లభించాలని ఆకాంక్షించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా చేనేత వస్త్రకళలు నిలుస్తాయని, భారతీయ వస్త్రాలకు అంతర్జాతీయంగా ప్రాచుర్యం ఉందన్నారు. చేనేతకారులకు మరింత ప్రోత్సాహం అందించడానికి, వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చేరాలనే సదుద్దేశంతో ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటుచేసిన నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌ల కృషిని అభినందించారు. వస్త్రప్రదర్శనలోని వస్త్రాలను తిలకించి చేనేతకారులను ప్రశంశించారు. ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ వస్త్రాలను సుమారుగా 80స్టాల్స్ ప్రదర్శిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల11వరకు ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు.

## హ్యాండీ క్రాఫ్ట్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే మాధవరం

హైదరాబాద్ దేశంలోని వివిధ రాష్ట్రాల సంప్రదాయ చేనేత వస్త్రాలు, హస్తకళలను ఒకే చోటఅందుబాటులో ఉంచడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు .హైదరాబాద్ మోతీ నగర్ కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్ లూమ్ అండ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళాను నిర్వహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్ర ఉత్పత్తులు, హస్తకళాకారులు తయారు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు.దసరా, బతుకమ్మ, దీపావళి పండుగలను పురస్కరించుకుని మంగళగిరి ,ఉప్పాడ, వెంకటగిరి ,భాగల్ పూర్ శారీస్ తో పాటు డిజైనర్ వేర్ ఉత్పత్తులు ఇక్కడ అందుబాటులో ఉంచామని నిర్వహకులు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్ వచ్చే నెల ఒకటో తేదీ వరకు కొనసాగుతుంది . దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన బ్రాండెడ్ వస్త్ర ఉత్పత్తులు వీవర్స్ టు కస్టమర్ కు అందిస్తున్నట్లు నిర్వహకులు మహ్మద్ సాబేర్ అలీ ,అక్బర్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం పది నుండి రాత్రి పది వరకు ఈ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందన్నారు

# మీ వెన్నంటి భారత్ ఉంది:

**అమెరికాలో ప్రవాసులకు పీయూష్ గోయల్ భరోసా**

**ప్రపంచంలో ఎక్కడున్నా భారతీయులకు దేశం అండగా నిలుస్తుందన్న మంత్రి**

**యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాలను ఉదహరించిన కేంద్ర మంత్రి**

**ప్రవాస భారతీయులు భారత్, అమెరికాల మధ్య జీవ వారధులుమీరు స్వీకరించిన దేశానికి విశ్వాసంగా ఉండాలని సూచన**

**గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో ప్రవాసులతో సమావేశం**

షికాగో ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, ఎలాంటి కష్టాల్లో చిక్కుకున్నా ప్రవాస భారతీయులకు తమ దేశం అండగా నిలుస్తుందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ భరోసా ఇచ్చారు. “మీ వెన్నంటి భారత్ ఉంది” అంటూ అమెరికాలోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. గాంధీ జయంతి సందర్భంగా షికాగోలో పర్యటించిన ఆయన, స్కోకీలోని మహాత్మా గాంధీ స్మారక విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అక్కడి ప్రవాస భారతీయులతో మాట్లాడారు. గతంలో యెమెన్, ఉక్రెయిన్ సంక్షోభాల సమయంలో విదేశాల్లోని భారతీయుల భద్రత కోసం ప్రభుత్వం ఎంతగా తపించిందో ఆయన గుర్తుచేశారు. “మీరు ఏ దేశంలో, ఏ పరిస్థితుల్లో ఉన్నా మీ మాతృభూమి మీకు అండగా ఉంటుంది. మీ కుటుంబాలకు, మీ పిల్లలకు తోడుగా నిలుస్తుంది” అని గోయల్ స్పష్టం చేశారు. అమెరికా, భారత్ మధ్య ప్రవాస భారతీయులు ఒక జీవ వారధిలాంటి వారని గోయల్ అభివర్ణించారు. “మీలో ప్రతి ఒక్కరూ అమెరికాలో భారత రాయబారులే” అని ఆయన అన్నారు. ప్రవాస భారతీయులు తాము స్వీకరించిన దేశానికి (అమెరికాకు) నిజాయతీగా, నిబద్ధతతో సేవ చేయాలని సూచించారు. అదే సమయంలో, తమ మాతృభూమిని, ఇక్కడి ప్రజలను తమ హృదయంలో పదిలంగా ఉంచుకోవాలని కోరారు. ఈ పర్యటనలో భాగంగా, 1893లో స్వామి వివేకానంద చరిత్రాత్మక ప్రసంగం చేసిన ఫుల్లర్టన్ హాల్‌ను కూడా ఆయన సందర్శించారు.

## తిరుమలకు రాపిడో, ఓలా, ఉబర్ బైక్‌లు నిషేధం!

**టీటీడీ కీలక నిర్ణయం**

**అలిపిరి వద్ద ‘నాట్ అలౌడ్’ బోర్డులు**

**యాప్‌లలో తిరుమల ఆప్షన్ తొలగింపునకు చర్యలు**

తిరుమల :శ్రీవారి భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తిరుమల ఘాట్ రోడ్లలో రాపిడో, ఓలా, ఉబర్ వంటి బైక్ ట్యాక్సీ సర్వీసులను టీటీడీ పూర్తిగా నిషేధించింది. ఇటీవల హైదరాబాద్‌కు చెందిన సునీల్ అనే భక్తుడు శ్రీవారి దర్శనానంతరం తిరుపతి విమానాశ్రయానికి వెళ్లేందుకు రాపిడో బైక్‌ను బుక్ చేసుకున్నారు. ఈ క్రమంలో తిరుమల మొదటి ఘాట్ రోడ్డులోని 26వ మలుపు వద్ద ద్విచక్రవాహనం క్రాష్ బారియర్‌ను బలంగా ఢీకొనడంతో బైకర్ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, భక్తుడు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదాన్ని టీటీడీ యాజమాన్యం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఘాట్ రోడ్డులో భక్తుల ప్రాణాలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో వాణిజ్య బైక్ రైడ్లను తిరుమలకు అనుమతించకూడదని నిర్ణయించారు. ఈ మేరకు అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద ‘నాట్ అలౌడ్’ పేరిట పోస్టర్లను ప్రదర్శించారు. తిరుమల ఘాట్ రోడ్లలో కేవలం వ్యక్తిగత ద్విచక్రవాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుందని, యాప్‌ల ద్వారా బుక్ చేసుకునే బైక్‌లను ఎట్టిపరిస్థితుల్లోనూ కొండపైకి రానివ్వబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి వాహనాల రాకపోకలపై అలిపిరి వద్ద తనిఖీ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. మరోవైపు, రైడింగ్ యాప్‌లలో తిరుమల గమ్యస్థాన ఆప్షన్ కనిపించకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత సంస్థలను సంప్రదించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది

# గల్లంతైన విద్యార్థుల మృతదేహాలు లభ్యం



విశాఖపట్నం శుక్రవారం నాడు ఋషికొండ బీచ్లో ముగ్గురు విద్యార్థులు గల్లంతయ్యారు. ఆదే రోజు ప్రశాంత్ మృతదేహం లభ్యం అయింది. శనివారం ఉదయం నితీష్, సూర్య మృతదేహాలు ఒడ్డుకు కొట్టుకొచ్చాయి. బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## అనుమానంతో ప్రియురాలిపై యువకుడి దాడి

### భవనం పైనుంచి దూకి మృతి చెందిన ప్రియుడు

విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటలో ప్రేమోన్మాది ఘాతుకం సష్టించారు. ప్రియురాలి మెడను కొడవలితో కోసాడు. స్థానికంగా వుంటున్న మహాలక్ష్మి , చిన్నారావు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. మహాలక్ష్మి పై అనుమానంతో చిన్నారావు పీక కోసి హత్యాయత్నానికి ఒడిగట్టాడు. మహాలక్ష్మి తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. మహాలక్ష్మి పై దాడి న తరువాత చిన్నారావు డాబా పై నుంచి దూకాడు. బిల్డింగ్ పై నుంచి దూకడంతో చిన్నారావు ప్రాణాలు కోల్పోయాడు.

# ఆర్టీసి మెట్రో కామన్ పాస్ అమలు

## మెట్రో లో ప్రయాణించిన మంత్రులు

హైదరాబాద్ నగరంలో ఆర్టీసీ మెట్రో కామన్ పాస్ అమల్లోకి వచ్చింది. కామన్ పాస్ తోటి అటు మెట్రో ఇటు ఆర్టీసి లో ప్రయాణం చేయొచ్చు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, అజారుద్దీన్, ఎమ్మెల్యేలు శ్రీ గణేష్ , నవీన్ యాదవ్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,అధికారులు ప్రయాణం చేసి చూపించారు బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వరకు వెళ్లారు . మంత్రులు జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ నుంచి ఆర్టీసి బస్సులో ప్రయాణించారు. సెమెట్రోతో పాటు ఆర్టీసి బస్సులో ప్రయాణించారు.
ఉప ముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ఆర్టీసీ?మెట్రో కామన్ పాస్తో ప్రయాణం మరింత సులభం. ?బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్పోస్ట్ వరకు కామన్ పాస్తో ప్రయాణిచాం. ?మెట్రో, ఆర్టీసీ సేవల సమన్వయంతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యం. ?మెట్రో దిగిన తర్వాత బస్సు కోసం ప్రయాణికులకు ఇక అయోమయం ఉండదు.
?ఒకే పాస్తో మెట్రో?ఆర్టీసీ ప్రయాణం.. ప్రయాణికులకు సౌకర్యవంతమైన విధానం ఇది. ?కామన్ పాస్ చాలా మంచి, అనుకూలమైన విధానం అని అయన అన్నారు.
?మెట్రో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునేలా తొలి కనెక్టివిటీగా ఆర్టీసీ బస్సులు వుంటాయి. ?మెట్రో?ఆర్టీసీ అనుసంధానాన్ని మరింత విస్తరిస్తాం. ?ఇంటి నుంచి గమ్యస్థానం వరకు సులభమైన ప్రయాణమే ప్రభుత్వ లక్ష్య. ?భవిష్యత్లో మెట్రో?ఆర్టీసీతో పాటు ఆటోలు, ఊబర్ సేవలను అనుసంధానించే ఆలోచన వుందని అన్నారు.
?చివరి గమ్యస్థానానికి చేరుకునేలా 'లాస్ట్ మైల్ కనెక్టివిటీ'పై దృష్టి పెడుతున్నారు. ?ప్రజా రవాణా వ్యవస్థను సమగ్రంగా అనుసంధానం చేస్తాం. ?ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యంగా ఆర్టీసీ?మెట్రో కామన్ పాస్ వుంటుఇంది

# ఇద్దరు పిల్లలతో బావిలో దూకి తల్లి ఆత్మహత్య



పరిగి : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం సోమన్‌గుర్తిలో విషాదం చోటు చేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకి తల్లి ఆత్మహత్య చేసుకుంది. తల్లి మమత, కూతురు జనశ్రీ మృతదేహాలు ఇప్పటికే లభ్యం అయ్యాయి. కుమారుడు సాకేత్ మృతదేహం కోసం గాలిస్తున్నారు. ఊర్లోని ఓ బావిలో మమత ఇద్దరు పిల్లలతో సహా దూకేసింది. బావిలో నీళ్లు ఎక్కువగా ఉండటంతో సాకేత్ మృతదేహం ఇంకా కనిపించలేదు. భర్త తో గొడవ కారణంగానే మమత ఇద్దరు పిల్లలతో కలిసి బావిలో దూకినట్లు తెలుస్తోంది. శుక్రవారం భర్తతో గొడవ కాగా ఉదయం ఇద్దరు పిల్లలతో బయటకు వెళ్లింది. రాత్రైనా ఇంటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వ్యక్తులు , బంధువులు వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో సమీప పొలాల వద్ద వెతకడం ప్రారంభించారు. సోమనుర్తి గ్రామ శివారులో ఓ వ్యవసాయ బావి వద్ద చెప్పులు, ఒక బ్యాగు ఉండటంతో బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు భావించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో బావిలో వెతకగా తల్లి, కూతురు మృత దేహాలు లభించాయి. ఆ మృతదేహాలు మమత, జనశ్రీవిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. సాకేత్ మృతదేహం కోసం పోలీసులు బావిలో వెతుకుతున్నారు.

# విజయనగరం జిల్లాలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ

### పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

### జగన్ ఒక నియంత అంటూ తీవ్ర వ్యాఖ్యలు

విజయనగరం జిల్లాలో వైసీపీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే, మాజీ జడ్పీ ఛైర్మన్ బడ్డుకొండ అప్పలనాయుడు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలతో వైసీపీ అధిష్ఠానం ఆయన్ను నిన్న సస్పెండ్ చేయగా, ఆ మరుసటి రోజే ఆయన పార్టీని వీడటం గమనార్హం. విజయనగరంలో మీడియా సమావేశంలో మాట్లాడిన అప్పలనాయుడు... పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జగన్‌ను ఒక 'నియంత'గా అభివర్ణించిన ఆయన... వైసీపీ ఒక లిమిటెడ్ కంపెనీగా మారిపోయిందని ఆరోపించారు. గౌరవం లేని చోట తాను, తన అనుచరులు ఇకపై కొనసాగలేమని స్పష్టం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలు, చంద్రబాబు ఎలాగూ ఓడిపోతారన్న జగన్ అతివిశ్వాసమే పార్టీ ఘోర పరాజయానికి కారణమని విశ్లేషించారు. పార్టీలో క్రమశిక్షణ కమిటీ అనేది ఒకటుందా? అని ప్రశ్నించిన అప్పలనాయుడు... నేతలు తమ సొంత సంస్థలా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జగన్‌ను నమ్మి వేలాది కుటుంబాలు నాశనమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన బంధువైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను సస్పెండ్ చేసినప్పుడు, ఆయనకు మరో బంధువైన బొత్స సత్యనారాయణపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఇటీవల చిన్న శ్రీను, ఆయన కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన సంగతి తెలిసిందే. ఆయనతో పాటు పలువురు స్థానిక నేతలు, జడ్పీటీసీలు కూడా వైసీపీని వీడారు. చిన్న శ్రీనుకు అత్యంత సన్నిహితుడైన బడ్డుకొండ కూడా ఇప్పుడు పార్టీ నుంచి నిష్క్రమించడంతో, ఒకప్పుడు బొత్స కుటుంబానికి కంచుకోటగా ఉన్న విజయనగరం జిల్లాలో వైసీపీ బలం గణనీయంగా క్షీణిస్తోందన్న చర్చ జరుగుతోంది.

# తొమ్మిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య



కడప పరుగు పందెంలో పాల్గొనొద్దని తల్లిదండ్రులు చెప్పడంతో మనస్తాపానికి గురై బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో నాగ అజయ్(15) తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. గత సంవత్సరం కిందపడి కాలికి గాయమై నెల రోజుల పాటు చికిత్స పొంది, ఇప్పటికీ అప్పుడప్పుడు ఆసుపత్రికి వెళ్లి చికిత్స తీసుకుంటున్నాడు.
ప్రొద్దుటూరులో గత నెల 30న నిర్వహించిన ఖోఖో పోటీల్లో పాల్గొని, అనంతరం ఈ నెల 1న పరుగు పందెంలో పాల్గొనేందుకు సిద్ధమైయాడు. అయితే కాలి గాయం ఎక్కువ అవుతుందని ఈ సంవత్సరం ఆటలకు దూరంగా ఉండాలని, వచ్చే సంవత్సరం కొత్త బూట్లు కూడా కొనిస్తామని తల్లిదండ్రులు నచ్చచెప్పారు.తోటి విద్యార్థులు పోటీలో పాల్గొని తాను పాల్గొనలేదని మనస్తాపానికి గురై నాగ అజయ్ ఆత్మహత్య చేసుకున్నాడు.

# రోడ్డు లేదు.. రోడ్డు డాక్టర్ లేడు.. అంబులెన్స్ లేదు

## తీరని అల్లూరి జిల్లా ఏజెన్సీలో డోలీ మోత కష్టాలు

అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలో స్థానికులకు డోలి మోతలు తప్పడం లేదు. ఒక గర్భిణీ ని సుమారు 7 కిలోమీటర్ల మేర డోలీపై మోసుకుంటూ తరలించాల్సిన దుస్థితి నెలకొంది. రహదారి లేక తడకపల్లి గ్రామం నుంచి నెలలు నిండిన గర్భిణీని గ్రామస్థులు డోలీలో మోసుకెళ్లారు .అంబులెన్సు రాకపోవడంతో డోలీ మోతనే నమ్ముకున్నారు. భారీ వర్షంలోనూ డోలీ ప్రయాణం కొనసాగింది.

# కరెంట్ కోసం రామాయంపేటలో రైతుల రాస్తారోకో..

## రెండు గంటలు స్తంభించిన ట్రాఫిక్




రామాయంపేట: వసాయానికి కనీసం 8 గంటల విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో రైతులు రాస్తారోకో చేపట్టారు. రామాయంపేట?ఎల్కతుర్తి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో సుమారు రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో ఉందని, ఈ సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని ఈ సందర్భంగా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి 8 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నా.. ఎప్పుడు సరఫరా నిలిచిపోతుందో, ఎప్పుడు పునరుద్ధరిస్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ సరఫరాను నిరంతరాయంగా అందించాలని పలుమార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాను సక్రమంగా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల రాస్తారోకోతో రహదారిపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్సై బాలరాజు అక్కడకు చేరుకుని రైతులను సముదాయించి, ఆందోళనను విరమింపజేశారు. అనంతరం ట్రాఫిక్ పునరుద్ధరించారు.

# విద్యార్థుల్లో సామాజిక స్పృహ పెంపొందించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలి

### విద్యార్థుల మనస్తత్వాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ సరైన మార్గనిర్దేశం చేయాలి

### అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

### జిల్లా ఎస్పీ మహేష్ బి.గితేరాజన్న

సిరిసిల్ల జిల్లా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని (ఖీూఓం) టీ అర్ ఎస్ ఎం ఎ. రాజన్న సిరిసిల్ల జిల్లా ఆధ్వర్యంలో పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమనికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే హాజరై ఉత్తమ ఉపాధ్యాయులను అభినందించారు.విద్యార్థుల్లో సామాజిక స్పృహను పెంపొందించి, వారు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. విద్యార్థులతో తల్లిదండ్రులతో పాటు ఎక్కువ సమయం గడిపేది ఉపాధ్యాయులేనని, కాబట్టి వారి ప్రవర్తన, ఆలోచనా విధానం, మనస్తత్వంలో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన సమయంలో సరైన మార్గనిర్దేశం చేయాలని , పిల్లలు తమ సమస్యలను తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులతో కూడా పంచుకునే అవకాశం ఉన్నందున పాఠశాలల్లో వారికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆధునిక సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాలు సమాచార వినియోగనికి ఎంతగానో ఉపయోగపడుతున్నప్పటికీ, వాటి అధిక వినియోగం వల్ల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా, విజ్ఞతతో వినియోగించేలా విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు.విద్యార్థులు ఆపదకర పరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు వాటిని ఎలా గుర్తించాలి, ఎలా స్పందించాలి, ఎవరిని సంప్రదించాలి అనే అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లాలో షీ టీమ్ బృందం ఆధ్వర్యంలో గుడ్ టచ్?బ్యాడ్ టచ్, బాలల రక్షణ, సైబర్ భద్రత తదితర అంశాలపై నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రచారి, (టీ అర్ ఎస్ ఎం ఎ)రాష్ట్ర నాయకులు శివరాత్రి యాదగిరి, రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, డి.టి.ఓ. శ్రీనివాస్, టీ అర్ ఎస్ ఎంఎం ఎ జిల్లా అధ్యక్షులు నాగుల శ్రీనివాస్ గౌడ్, కరస్పాండెంట్లు, ఉత్తమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అనుమానం పెనుభూతమై.. భార్యను హతమార్చిన భర్త

గద్వాల : జోగుళాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం ఓబులోనిపల్లి గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యపై అనుమానంతో భర్త గోపి (40) తన భార్య జములమ్మ (35)పై రోకలిబండతో దాడి చేసి హత్య చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ఘటన అనంతరం గోపి పరారైనట్లు సమాచారం. గట్టు మండలం ఆలూరు గ్రామానికి చెందిన గోపి సుమారు 17 ఏళ్ల క్రితం ఓబులోనిపల్లికి ఇల్లరికం వచ్చి జములమ్మను వివాహం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా భార్యపై అనుమానంతో గోపి తరచూ జములమ్మతో గొడవపడేవాడని, గత రెండేళ్లుగా వీరి మధ్య వివాదాలు కొనసాగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ క్రమంలో తాజాగా మరోసారి భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో గోపి రోకలిబండతో జములమ్మపై దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన జములమ్మ మృతి చెందినట్లు సమాచారం. ఘటనతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.
దంపతులకు ఇద్దరు పిల్లలు ఉండటంతో వారి పరిస్థితిపై గ్రామంలో ఆవేదన వ్యక్తమవుతోంది. మరోవైపు గోపి మానసిక పరిస్థితి సరిగా లేదని కొందరు గ్రామస్తులు చెబుతున్నప్పటికీ, దీనిపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. భార్యపై అనుమానమే హత్యకు కారణమా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేయాల్సి ఉంది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పరారీలో ఉన్న గోపి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. జములమ్మ మృతికి దారితీసిన పూర్తి వివరాలు, ఘటనకు గల కారణాలు, నిందితుడి పాత్ర తదితర అంశాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది

### ఏపీ మోడల్ స్కూల్ పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ గా సుభాన్ ఏకగ్రీవంగా ఎన్నిక



గోనెగండ్ల శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ూఓఅ ఎన్నికల సమావేశంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ పదవికి సుభాన్ పేరును సభ్యులు ప్రతిపాదించగా, మిగతా సభ్యులందరూ మద్దతు తెలపడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రిన్సిపల్ ప్రకటించారు.అనంతరం నూతన ఛైర్మన్ సుభాన్ ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ూఓఅ సభ్యులు ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా సుభాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి పనిచేస్తానని పేర్కొన్నారు.పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల హాజరు శాతం పెంపు, పారిశుద్ధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఆయన తెలిపారు.ప్రిన్సిపల్ షాహిన్ పర్వీన్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో ూఓఅ పాత్ర కీలకమని అన్నారు. నూతన ఛైర్మన్ నాయకత్వంలో పాఠశాల మరింత ప్రగతి సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రోత్సాహం అందించేందుకు కమిటీ కృషి చేయాలని సూచించారు.

# సంగీతం ద్వారాభగవంతుని ఆరాధించడమే భక్తి గీతాలు ముఖ్య ఉద్దేశం

## చెరుకుపల్లి భక్తి గీతాలరాగ సాగరం పుస్తక ఆవిష్కరించిన డాక్టర్ కాపా చంద్ర కళ మురళి కృష్ణ

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 3:**వైరా లోని శ్రీ కోదండ రామాలయంలో కళావేదిక కార్యక్రమంలో భక్తి సాగరం ప్రముఖ రచయిత చేరుకుమల్లి వెంకటేశ్వర రావు రచించిన భక్తి గీతాలు రాగసాగరం పుస్తక ఆవిష్కరణను శు క్రవారం రాత్రి మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ఎందరో మహానుభావులు తమ కీర్తనల ద్వారా భక్తి రసాన్ని పండించారని భారతీయ సంస్కృతిలో మరియు సనాతన ధర్మం లో అత్యంత ముఖ్యమైన భాగం లలిత





కళల్లో ఒకటైన సంగీతం ద్వారా భగవంతుని ఆరాధించడమే భక్తి గీతాలు ముఖ్య ఉద్దేశమని ఆమె అన్నారు. చెరుకుమల్లి వెంకటేశ్వరరావు భక్తి గీతాలురాగ సాగరం యూట్యూబ్ ద్వారా భక్తి గీతాలు ప్రజలకు అందించడం పట్ల ఆమె ప్రశంసించారు అనంతరం నృత్య కళా భారతి మరియు చెరుకుమల్లి భక్తి గీతాల ను అ లపించారు. నాట్య కళల పట్ల విశిష్ట సేవలు అందిస్తున్న నృత్య భూషణ్ అవార్డు గ్రహీత పీవీ నట రాజు లలిత కళలు ప్రోత్సహిస్తున్న సంగీత విద్వాంసులు ముటుకుల హైమావతి ప్రసాద్ వాయిద్య సహకారం తో సాగిన భక్తి సాగరశీ ద్వారా ప్రజలకు మరింత చేరువైన చెరుకుమల్లి వెంకటేశ్వరరావు నిర్మల దంపతులను ఘనంగా సత్కరించారు సాయి మణికంఠ భక్త బృందశీ శ్రీ సాయి మణికంఠ భజన మండలి వాసవి నటరాజ బంధం నాగసాయి నటరాజ వంశీల భక్తి గీతాలు ఆలపించారు చెరుకుమల్లి వెంకటేశ్వరరావు ఆలపించిన నీ పూజ భక్తి గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులు కే దేవరాయలు డాక్టర్ భూమేశ్వరరావు డాక్టర్ కాపాముర‌ళీకృష్ణ కట్ట కృష్ణార్జున వనమా విశ్వేశ్వరరావు నామ లక్ష్మీ నారాయణ లోక వేణు లోక రమాదేవి నూకల అన్నపూర్ణ 5.12 వార్డు కౌన్సిలర్లు కట్టాస్వరూప రాణి మాదినేని సునీత భక్త బృందం తదితరులు పాల్గొన్నారు

# సర్పంచులకు తెలియకుండానే పనులా..?

## అధికారుల తీరుపై మండిపడ్డ సర్పంచులు..

## పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 3:** గ్రామపంచాయతీల్లో సర్పంచులకు సమాచారం ఇవ్వకుండానే పనులు ఎలా చేపడతారని లింగపాలెం సర్పంచ్ యర్రా రమేష్ అధికారులను ప్రశ్నించారు. శనివారం వేంసూరు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, పెండింగ్ బిల్లుల అంశంపై సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను వివరించారు. అనంతరం సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా యర్రా రమేష్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి సర్పంచులు కట్టుబడి ఉన్నప్పటికీ, కొందరు అధికారులు తమకు సమాచారం ఇవ్వకుండానే గ్రామాల్లో పనులు చేపడుతున్నారని ఆరోపించారు. గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు.

ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్

గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం సర్పంచులు అప్పులు చేసి సొంతంగా నిధులు వెచ్చిస్తున్నారని, పనులు పూర్తయినప్పటికీ ఆరు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు ఉన్నప్పటికీ బిల్లులు చెల్లించకపోవడం సరికాదన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేకపోతే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఎలా కొనసాగించాలని ప్రశ్నించారు.

లింగపాలెంలో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపాలి

సత్తుపల్లి--విజయవాడ మార్గంలో నడిచే ఎక్స్‌ప్రెస్ బస్సులను లింగపాలెంలో నిలిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు. విజయవాడ నుంచి సత్తుపల్లి వచ్చే బస్సులనైనా లింగపాలెంలో ఆపాలని విజ్ఞప్తి చేశారు.

చేపల చెరువుల ఆదాయం పంచాయతీలకే ఇవ్వాలి

గ్రామపంచాయతీల పరిధిలోని చేపల చెరువులను మత్స్యశాఖకు అప్పగించడం వల్ల పంచాయతీలు ఆదాయం కోల్పోతున్నాయని సర్పంచులు పేర్కొన్నారు. చెరువుల వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని పంచాయతీ ఖాతాల్లోనే జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వేసవికి ముందే తాగునీటి ప్రణాళిక

రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సర్పంచులు కోరారు. గ్రామాల్లో తాగునీటి వనరులు, సరఫరా వ్యవస్థను ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.

సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సంతోష్‌కుమార్, ఎంపీడీవో కావ్య, తహసీల్దార్ మాణిక్‌రావు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఎంఈవో చలంచర్ల వెంకటేశ్వరరావు, ఏవో రామ్మోహన్‌రావు, ఏఎస్ఐ నాగేశ్వరరావుతో పాటు వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజల ఆస్తులకు రక్షణ..

## చెంచుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

## శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి

ఆత్మకూరు: ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడంతో పాటు చెంచు గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఎన్డీయే ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామంలో రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసుపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఆత్మకూరు మండల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఐటీడీఏ ఆధ్వర్యంలో చెంచు గిరిజన ఉద్యానవన రైతులకు పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారదర్శకంగా సర్వే నిర్వహించి ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలను అందిస్తున్నామని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించిందన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు. వెంకటాపురం, బైర్లూటి, కృష్ణాపురం, అమలాపురం, శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం గ్రామాల్లోని సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు



రూ.30 కోట్లతో శ్రీ బుడ్డా వెంగళరెడ్డి సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి నీటిని అందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామని వెల్లడించారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందిస్తున్నామని తెలిపారు. చెంచు గిరిజన రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయం, ఉద్యానవన రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నామని అన్నారు. ప్రతి చెంచు కుటుంబానికి పక్కా ఇళ్లు అందించేందుకు కృషి చేస్తున్నామని, గూడేల్లో మౌలిక వసతులతో పాటు విద్య, వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. చెంచుల అభివృద్ధి కోసం దేశంలోనే తొలిసారిగా ఐటీడీఏను ఏర్పాటు చేసిన ఘనత దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావుకు దక్కుతుందని బుడ్డా రాజశేఖర రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు అధిక నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

# వెన్నవల్లి గుట్టకు రక్షణేదీ?

## అడ్డగోలుగా తవ్వకాలే..

## చివరకు జేసీబీ డ్రైవర్ మృతి

## గుట్ట చుట్టూ సొరంగంలా తవ్వకాలు..

## ఒక్కసారిగా కుప్పకూలిన కొండ





**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 3:** ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరుకొండి--వెన్నవల్లి గ్రామాల మధ్య ఉన్న వెన్నవల్లి గుట్ట వద్ద జరిగిన ప్రమాదం స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారితీసింది. గుట్ట చుట్టూ సొరంగంలా తవ్వకాలు చేపట్టిన సమయంలో ఒక్కసారిగా మట్టి కుప్పకూలి జేసీబీపై పడటంతో డ్రైవర్ మట్టిలో చిక్కుకుని మృతి చెందినట్లు సమాచారం.

గుట్టను ప్రమాదకర స్థాయిలో తవ్వుతున్నారని తెలిసినా నెలల తరబడి సంబంధిత అ ది, కా ం ం ల ం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిసినా తవ్వకాలు ఎలా కొనసాగాయి? పర్యవేక్షించాల్సిన మైనింగ్ అధికారులు ఏం చేస్తున్నారు? అంటూ గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.

ముడుపుల మహిమా? పెద్దల అండదండలా? అనుమతులకు మించి తవ్వకాలు జరిగాయా? నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు కొనసాగుతున్నా అధికారులు ఎందుకు స్పందించలేదన్నదానిపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యమా.. లేక ఇతర కారణాలున్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

ప్రమాదం అనంతరం ఘటనకు సంబంధించిన వివరాలు బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీటిపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది.

ఒక నిండు ప్రాణం బలైన తర్వాతైనా వెన్నవల్లి గుట్ట తవ్వకాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పెద్ద కోరుకొండి, వెన్నవల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మైనింగ్ అనుమతులు, తవ్వకాల నిబంధనలపై అధికారుల వివరణ తెలియాల్సి ఉంది.

## ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ నచ్చికేతే విశ్వనాథ్

ప్రొద్దుటూరు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ ఐదున ప్రొద్దుటూరు మండలంలో పర్యటించనున్న నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ నచ్చికేతే విశ్వనాథ్ , జాయింట్ కలెక్టర్ డా,, నిధి మీనా లతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ డా,, శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రొద్దుటూరు పట్టణంలోని జమ్మలమడుగు రోడ్డులో జలజీవన్ మిషన్ కు సంబంధించి అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పర్యటన ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది. ముందుగా అమృత నగర్ వద్ద ఏర్పాటుచేసిన హెలిపియాడ్ను పరిశీలించి ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీర్లకు పలు సూచనలు ఇవ్వడం జరిగింది అదేవిధంగా నాయకుల లైన్ ఆఫ్ కోసం భారీ కేడ్ల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ పలు సూచనలు ఇవ్వడం జరిగింది అనంతరం కొర్రపాడు రోడ్డు సర్కిల్లో ఏర్పాటు చేసిన జెల్ జీవన్ మిషన్ పథకంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనుల పైలాన్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు అనంతరం ప్రొద్దుటూరు బైపాస్ జమ్మలమడుగు మార్గంలోని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి పాల్గొనే ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించి అక్కడ గ్యాలరీలు, సెక్యూరిటీ నిర్వహణ తదితర అంశాలపై నాయకులు సంబంధిత అధికారులతో చర్చించడం జరిగింది. ముఖ్యమంత్రి నిర్వహించే పార్టీ లీడర్ సమావేశం కోసం అక్కడ భద్రత ఏర్పాట్లపై సబ్ కలెక్టర్ హెచ్ ఎస్ భావన, ఏ ఎస్ పి విభూ కృష్ణ, సంబంధిత అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై మాట్లాడిన సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, భూపేష్ రెడ్డిలు జిల్లా కలెక్టర్ కు పలు సూచనలు చేశారు . ఈ కార్యక్రమంలో ఆర్డీవో శిరీష, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు, ఆర్డబ్ల్యూఎస్, ఆర్ అండ్ బి, ఏపీ ఎస్పీడీసీఎల్, పంచాయతీరాజ్, పోలీస్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు

## రాయదుర్గంలో కలకలం..

## కంపచెట్లపై శిశువు

అప్పుడే పుట్టిన నవజాత శిశువును కంపచెట్లపై వేలాడుతూ కనపడిన అమానవీయ ఘటన రాయదుర్గంలోని చంద్రబాబు నాయుడు కాలనీలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. దారిలో వెళ్తున్న వారు శిశువును గమనించి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు ఘటనా స్థలానికి చేరుకొని విచారం వ్యక్తం చేశారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# రూ.16,384 కోట్ల పారిశ్రామిక పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించిన పరిశ్రమల శాఖ

## హైదరాబాద్ దాటి విస్తరిస్తున్న పారిశ్రామిక రంగం.... వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, సంగారెడ్డి , వికారాబాద్ వరకు...విస్తరణ



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి: హైద్రాబాద్ అక్టోబర్ 3 పరిశ్రమల శాఖ గణాంకాల ప్రకారం, తెలంగాణ 2026-27లో ఇప్పటివరకు రూ.16,384 కోట్ల విలువైన పారిశ్రామిక పెట్టుబడి ప్రతిపాదనలను ఆమోదించింది. ఇది గత ఆర్థిక సంవత్సరం మొత్తంలో ప్రతిపాదించిన రూ.10,237 కోట్ల ప్రతిపాదనలను అధిగమించింది.ఈ సంవత్సరం రూ.16,384.5 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో, 30,511 మందికి ఉపాధి కల్పించే లక్ష్యంతో 1,172 పారిశ్రామిక యూనిట్లకు ఆమోదం లభించింది. 2025-26లో, రూ. 10,237.08 కోట్ల పెట్టుబడితో, 51,029 ఉద్యోగాల కల్పనతో 2,163 యూనిట్లకు ఆమోదం లభించింది. ఈ ఏడాది ఇప్పటివరకు తక్కువ యూనిట్లకు ఆమోదం లభించినప్పటికీ, ప్రతిపాదిత పెట్టుబడి గణనీయంగా ఎక్కువగా ఉంది. గతేడాది ఒక్కో యూనిట్పై సగటు పెట్టుబడి సుమారు రూ.4.7 కోట్ల నుండి ఈ ఏడాది రూ. 13.9 కోట్లకు పెరిగింది.

టీ ఎన్ ఐ ఈ తో మాట్లాడుతూ, పరిశ్రమల కమిషనర్, డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి జె, వ్యాపారం చేసే సౌలభ్యం మరియు వేగాన్ని మెరుగుపరచడం, పెట్టుబడిదారుల సమస్యలను పరిష్కరించడం మరియు పెండింగ్లో ఉన్న విషయాలను పర్యవేక్షించడం వంటి ప్రయత్నాలే ఈ పెరుగుదలకు కారణమని పేర్కొన్నారు.

రూ.79,031.96 కోట్ల విలువైన, 87,863 మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉన్న మరో 1,178 ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయి. కొన్ని ప్రధాన ప్రాజెక్టుల వివరాలు ఇంకా నవీకరించబడనందున, ఈ జాబితా మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు.

డేటా సెంటర్లు, ఏరోస్పేస్ మరియు రక్షణ రంగం, ఫార్మాస్యూటికల్స్, ముఖ్యంగా కాంట్రాక్ట్ డెవలప్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్స్, బయోలాజిక్స్ రంగాలలో కార్యకలాపాలు పెరిగాయి.

మొత్తంగా చూస్తే, రంగారెడ్డిలో అత్యధికంగా రూ.60,857 కోట్ల పారిశ్రామిక పెట్టుబడులు ప్రతిపాదించబడ్డాయి. ఆ తర్వాతి స్థానాల్లో నల్గొండ (రూ. 30,145 కోట్లు), సంగారెడ్డి (రూ.26,809 కోట్లు), మెద్చల్ (రూ.24,124 కోట్లు) మరియు భద్రాద్రి. కొత్తగూడెం (రూ. 21,903 కోట్లు) ఉన్నాయి.

మొత్తం ప్రతిపాదిత పెట్టుబడిలో ఫార్మాస్యూటికల్స్ మరియు రసాయనాల వాటా రూ.31,830 కోట్లు కాగా, ఆ తర్వాత సౌర మరియు ఇతర పునరుత్పాదక ఇంధనం (రూ.23,452 కోట్లు), పారిశ్రామిక పార్కులు, ఐటీ భవనాలు (రూ.20,256 కోట్లు), ఆహార శుద్ధి (రూ. 12,259 కోట్లు) మరియు ఇంజనీరింగ్ (రూ.11,486 కోట్లు) ఉన్నాయి. థర్మల్ పవర్ వాటా రూ.62,096 కోట్లు. ఈ జిల్లా రంగాల వారీ గణాంకాలు అన్ని సంవత్సరాల ఆమోదాలను కవర్ చేస్తాయి. ప్రస్తుత సంవత్సరపు పెట్టుబడికి వేరుగా ఉంటాయి.

తెలంగాణ ఎంఎస్ఎంఈ పర్యావరణ వ్యవస్థ పెద్ద ప్రాజెక్టులకు కూడా మద్దతు ఇస్తోందని చక్రవర్తి అన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ను ఉదహరిస్తూ, ఆ సంస్థ ఇటీవల ప్రయోగించిన రాకెట్లో ఉపయోగించిన భాగాలలో సుమారు 80 శాతాన్ని తెలంగాణ ఎంఎస్ఎంఈల నుంచే సేకరించినట్లు ఆయన తెలిపారు. ఈ డేటాలో ఎలక్ట్రానిక్స్ తో సహా పారిశ్రామిక కార్యకలాపాలు ఉన్నాయి, కానీ ఐటీ కంపెనీలు ఇందులో చేర్చబడలేదు. గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీల) పెట్టుబడులను విడిగా పరిగణనలోకి తీసుకుంటే, అవి విస్తృత పెట్టుబడి చిత్రానికి గణనీయంగా దోహదపడతాయని ఆయన అన్నారు.

హైదరాబాద్ దాటి కూడా పారిశ్రామిక కార్యకలాపాలు విస్తరిస్తున్నాయి. వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్ లలో వస్త్ర, ఆహార శుద్ధి పరిశ్రమలు పుంజుకుంటున్నాయి. సంగారెడ్డిలో మహీంద్రా, ఎంఆర్ఎఫ్, తోషిబా వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టి, విస్తరణలు చేపట్టగా, వికారాబాద్లోని మొబిలిటీ వ్యాలీ ఎలక్ట్రిక్, ప్యాసింజర్ వాహన పెట్టుబడులను ఆకర్షిస్తుందని అంచనా వేస్తున్నట్లు చక్రవర్తి తెలిపారు.సంబంధిత శాఖ ప్రకారం, తెలంగాణ ఇప్పటివరకు రూ.2,62,661.82 కోట్ల ప్రతిపాదిత పెట్టుబడితో 30,040 పారిశ్రామిక యూనిట్లకు ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 8.10 లక్షలకు పైగా ఉపాధి లభిస్తుందని అంచనా.

# స్మిత్ ముచ్చర్ త్వరగా కోలుకోవాలనిప్రత్యేక భాగ్యలక్ష్మి ఆలయం లో పూజలు నిర్వహించినబోయ నగేష్




హైద్రాబాద్ అక్టోబర్ 3: భారత విమాన పైలెట్, శ్రీ స్మిత్ ముచ్చర్ త్వరగా కోలుకోవాలని సాధారణ వ్యక్తిగా తిరిగి రావాలని, చంద్రయన్నగుట్ట అసెంబ్లీ నియోజకవర్గం తరఫున చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి అమ్మవారు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో, చార్మినార్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముజీబుల్లా షరీఫ్, తెలంగాణ రాష్ట్ర రజక కార్పొరేషన్ వైస్ చైర్మన్ బంగారు బాబు గారు, వెంకటేష్ ముదిరాజు గారు, బి మధుమోహన్ గారు, వాగ్గు పవన్ గారు, సందీప్ గారు, శ్రీకాంత్ గారు, గణేష్ రాథోడ్ గారు, వినోద్ గారు, చంద్రాయన గుట్ట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని ఒక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# జ్వరాల ముప్పులో నగరం

## (హెచ్. ప్రతాప్)

హైదరాబాద్ నగరాన్ని సీజనల్ ఫ్లూ, ఇన్ఫ్లూయెంజా 'ఎ' వైరస్, డెంగీ ఒకేసారి చుట్టుముట్టుతున్నాయి. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, ఒళ్లు నొప్పులు, తీవ్ర నీరసం వంటి సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండగా, మరోవైపు దోమల ఉద్ధృతి డెంగీ వ్యాప్తిని మరింత ఆందోళనకరంగా మారుస్తోంది. సాధారణ జ్వరమేనని నిర్లక్ష్యం చేస్తే కొన్ని సందర్భాల్లో పరిస్థితి తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

నగర శివారు ప్రాంతాల్లో ఇటీవల వారం వ్యవధిలో ఇద్దరు ఇంటర్ విద్యార్థులు డెంగీతో మృతి చెందడం కలకలం రేపింది. ఇప్పటివరకు నగరంలో సుమారు 300 డెంగీ కేసులు నమోదైనట్లు సమాచారం. వర్షాల తర్వాత పలు ప్రాంతాల్లో నిల్వ నీరు, పెరిగిన దోమల సంఖ్య వ్యాధి వ్యాప్తికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నాయి. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు జ్వరంతో బాధపడుతున్న ఘటనలు కూడా కనిపిస్తున్నాయి.

ఫ్లూ ప్రభావం కూడా విస్తృతంగానే ఉంది. వైద్యుల అంచనా ప్రకారం ఫ్లూ సోకిన వారిలో దాదాపు 90 శాతం మంది మూడు నుంచి నాలుగు రోజుల్లో కోలుకుంటారు. అయితే చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిలో సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉండటంతో మరింత అప్రమత్తత అవసరం.

డెంగీ విషయంలోనూ నిర్లక్ష్యానికి తావులేదని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ మంది సాధారణ చికిత్సతో కోలుకున్నప్పటికీ, దాదాపు 10 శాతం మందిలో ఆరోగ్య పరిస్థితి సంక్లిష్టంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కండరాలు--కీళ్ల నొప్పులు, కళ్ల వెనుక నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు.

ఫ్లూలో జ్వరం, గొంతునొప్పి, పొడి దగ్గు, ముక్కు కారడం లేదా మూసుకుపోవడం, ఒళ్లు నొప్పులు ప్రధాన లక్షణాలుగా కనిపిస్తున్నాయి. స్వయంగా మందులు వేసుకుని ఆలస్యం చేయడం కంటే వైద్యుల సలహా తీసుకోవడం మంచిదని స్పష్టం చేస్తున్నారు.

ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూడటం, దోమల పెరుగుదలను అరికట్టడం, దోమతెరలు ఉపయోగించడం, పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడం అత్యవసరం. జ్వరం వచ్చాక చికిత్స కోసం పరుగులు పెట్టడం కంటే, వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే పరిస్థితులను ముందుగానే అడ్డుకోవడమే నిజమైన రక్షణ.

# ఉద్యోగుల ఆందోళనలపై ప్రభుత్వం సీరియస్.. 46 మందికి నోటీసులు

అమరావతి అక్టోబర్ 3: ఇటీవల విజయవాడలో స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు ఉద్యోగులు చేసిన ఆందోళనలపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. నిరసనల్లో కీలకంగా వ్యవహరించిన 46 మందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించింది. వారు ఇచ్చే వివరణ తర్వాత కఠిన చర్యలు తీసుకొనే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. ఆంక్షలను ఉల్లంఘించినందుకు క్రిమినల్ కేసుల నమోదుకు విజయవాడ పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ను సన్మానిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అజ్మత్ పాషా



వికారాబాద్ అక్టోబర్ 3: : జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సాయి చౌదరిని జిల్లా తెలంగాణ నాన్ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజ్మీత్ పాష ఆధ్వర్యంలో సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అజ్మీత్ పాష మాట్లాడుతూ సమాజ సేవలో ముందుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో సాయి చౌదరి పాత్ర ప్రముఖమైనదని, తనను సన్మానించడం అంటే మనకు మనం సన్మానించుకున్నట్లేనని ఆ యొక్క పదవికి మహోన్నతమైన వ్యక్తి సాయి చౌదరి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ప్రజలే బుద్ధి చెబుతారు

## ప్రజల తీర్పు టిడిపికే అనుకూలం

## టిడిపి లీడర్ డాక్టర్,, కొంకుల రాంబాబు



బద్వేలు, నియోజకవర్గంలో రాబోయే 2026 మున్సిపాలిటీ, జడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తమ ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని టిడిపి సీనియర్ నాయకులు, బద్వేల్ మాజీ మున్సిపాలిటీ అధ్యక్షులు డా,, కొంకుల రాంబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచన విధానంతో ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజల్లో సానుకూల స్పందన ఉందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రగతి కోసం అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధంగా ప్రభుత్వంలోని అన్ని శాఖలను సమన్వయం చేస్తూ సుపరిపాలనకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం పెద్దపీట వేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సుదీర్ఘ రాజకీయ అనుభవం మరియు ముందుచూపుతో రాష్ట్ర పాలనను ప్రజలకు మరింత చేరువగా తీసుకెళ్తున్నారని అన్నారు.ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు సంక్షేమ కార్యక్రమాలు సకాలంలో అందేలా యంత్రాంగాన్ని ప్రభుత్వం దిశా నిర్దేశం చేస్తుందని ఆయన అన్నారు. నేడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రగతి కొన్ని దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే తెలుగుదేశం పార్టీకి (శ్రీరామరక్ష) పూర్తి మద్దతు తీసుకువస్తాయని అన్నారు. తెలుగుదేశం పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ మరియు రాష్ట్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని ఆయన అన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పును స్పష్టంగా వెల్లడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొంకుల రాంబాబు అన్నారు.

# చిత్రలేఖనంలో జీవన్ దుర్గేంద్రకు తృతీయ బహుమతి వక్తృత్వ పోటీలో సత్య వరలక్ష్మికి ప్రథమ బహుమతి



రాజవొమ్మంగి సేవా సంకల్ప్ అభియాన్ ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అక్టోబర్ 1న జిల్లా స్థాయి చిత్రలేఖన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాజవొమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పాల్గొని బహుమతులు సాధించారు.8వ తరగతి విద్యార్థిని సత్య వరలక్ష్మి వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించింది. 7వ తరగతి విద్యార్థి బి. జీవన్ దుర్గేంద్ర చిత్రలేఖన పోటీలో తృతీయ బహుమతి సాధించాడు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలో బహుమతి సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.విద్యార్థులను పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం సీహెచ్ శివకృష్ణ, పీఎంసీ చైర్మన్ బి. శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండబాబు, సత్యబాబు, స్వామి, జయలక్ష్మి పాల్గొన్నారు.

# శ్రీవారి దర్శనానికి వచ్చి చోరీలు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

తిరుపతిలో శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఆటో డ్రైవర్ గోవింద స్వామిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి 60 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, ఒక సెల్ఫోన్ను స్వాధీనం చేసుకున్నారు. భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించిన పోలీసులు, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు.

# ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు..

# గెలిస్తే నవరంధ్రాలు మూసుకొని సంబరాలా?

## బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ ఫైర్.



హైద్రాబాద్ అక్టోబర్3 : ప్రజాస్వామ్యానికి ఎన్నికలు, ఎన్నికల నిర్వహణ ప్రాథమిక పునాదిరాయి లాంటివని, వరుస ఓటములతో ప్రజల ఆదరణ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ మరియు కొన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యవస్థలన్నింటినీ భ్రష్టు పట్టించేలా చేస్తున్న కుట్రలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి అత్యధిక కాలం కాంగ్రెస్ పార్టీయే దేశాన్ని ఏలిందని, బీజేపీకి గతంలో కేవలం రెండు సీట్లు వచ్చినప్పుడు కూడా ఏనాడూ ఎన్నికల సంఘాన్ని గానీ, కోర్టులను గానీ తప్పుపట్టలేదని గుర్తుచేశారు. రాజ్యాంగ వ్యవస్థలపై ఉన్న నమ్మకంతోనే బీజేపీ 2 సీట్ల నుంచి 282, ఆ తర్వాత 303 సీట్లకు ఎదిగి నరేంద్ర మోదీ నేతృత్వంలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. దేశంలో అసలు ఈవీఎంలను ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని, ఇవి ఇంటర్నెట్‌తో సంబంధం లేని స్టాండ్‌అలోన్ మిషన్లని, ఓటరు తాను ఎవరికి ఓటు వేశారో 7 సెకన్ల పాటు చూసుకునే వీవీప్యాట్ సదుపాయం కూడా అందుబాటులో ఉందని, ఈ మొత్తం ప్రక్రియను సుప్రీంకోర్టు స్వయంగా పరిశీలించి సమర్థించిందని గుర్తుచేశారు.

గత లోక్‌సభ ఎన్నికల తర్వాత సీఈసీ జ్ఞానేష్ కుమార్ హయాంలో జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను లెక్కలతో సహా ఆయన మీడియా ముందు ఉంచారు. హర్యానాలో బీజేపీకి 39.94 శాతం ఓట్లు వస్తే, వ్యతిరేక ఓట్లు 60 శాతం వచ్చాయని, కాంగ్రెస్‌కు బీజేపీకి సమానంగా దాదాపు 39 శాతం ఓట్లు వచ్చినా ప్రతిపక్షాల మధ్య ఓట్ల చీలిక వల్లే కాంగ్రెస్ ఓడిపోయింది తప్ప ఈవీఎంల వల్ల కాదని స్పష్టం చేశారు. అదే జమ్మూ కాశ్మీర్‌లో ఇదే ఎన్నికల సంఘం, ఇదే ఈవీఎంలు, సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) జరిగాక నేషనల్ కాన్ఫరెన్స్–కాంగ్రెస్ కూటమి 96 శాతం స్థానాలు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే బీజేపీకి కేవలం 20 నుంచి 25 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయని, మరి అక్కడ గెలిచినప్పుడు ఎన్నికల సంఘాన్ని ఎందుకు నిందించలేదని ప్రశ్నించారు. మహారాష్ట్రలో ఎన్డీయేకి 49.3 శాతం ఓట్లు వస్తే విపక్షాలకు 50.7 శాతం ఓట్లు వచ్చాయని, అక్కడ కూడా విపక్షాల అంతర్గత చీలికల వల్లే ఓటమి పాలయ్యారని తెలిపారు. జార్ఖండ్‌లో ఎన్డీయేకి 38 శాతం ఓట్లు వస్తే ఇండియా కూటమి 44.33 శాతం ఓట్లతో విజయం సాధించిందని, మరి ఎన్నికల కమిషన్ అనుకూలంగా వ్యవహరిస్తే అక్కడ ఎన్డీయేతర పార్టీలు ఎలా గెలిచాయని నిలదీశారు. ఢిల్లీలో విపక్షాలకు 53 శాతం ఓట్లు వస్తే కాంగ్రెస్‌కు కేవలం 6.34 శాతమే వచ్చాయని, గత నాలుగు ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాని కాంగ్రెస్ ఓటమికి ఆప్ ప్రభుత్వం రిగ్గింగ్ చేసిందా లేక ఈసీ కారణమా అని దుయ్యబట్టారు. బీహార్‌లోనూ ఎన్డీయేకి 40 శాతం ఓట్లు వస్తే విపక్షాలకు 55 శాతం ఓట్లు వచ్చాయని, కేంద్రం వ్యవస్థలను ప్రభావితం చేయగలిగితే బీజేపీ ఓట్ల శాతం పెరగాలి తప్ప తగ్గడం ఎందుకని ఆయన ప్రశ్నించారు.

కేరళలో ఎస్ఐఆర్ పూర్తయ్యాక యూడీఎఫ్ (కాంగ్రెస్ కూటమి) ఎక్కువ స్థానాలు, 46.36 శాతం ఓట్లు సాధిస్తే.. డూప్లికేట్, చనిపోయిన ఓటర్ల ఏరివేత వల్లే కాంగ్రెస్ కూటమి లబ్ధి పొందిందని అక్కడి మంత్రులే స్వయంగా ప్రస్తావించారని గుర్తుచేశారు. ఎస్ఐఆర్ తప్పైతే ఆ ఫలితాలను కాంగ్రెస్ ఎందుకు తిరస్కరించలేదని, తమిళనాడులో 8 నుంచి 9 శాతం ఓట్ల తొలగింపు తర్వాత డీఎంకే–కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఎస్ఐఆర్‌ను ఎందుకు తప్పుపట్టలేదని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్‌లో నాన్–ఎన్డీయే పక్షాలకు 50 శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో కొత్తేమీ కాదని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటికే 13 సార్లు జరిగిందని వివరించారు. ఓటర్ల నమోదు, మార్పులకు ఫారమ్–6, ఫారమ్–8 ద్వారా స్పష్టమైన పరిష్కారాలు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పనిచేసే బూత్ లెవల్ అధికారులు (బీఎల్వోలు) రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులేనని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వ శాఖ కాదని, రాజ్యాంగబద్ధంగా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థ అని, రాష్ట్రపతికి, పార్లమెంటుకు మాత్రమే జవాబుదారీగా ఉంటుందని పేర్కొన్నారు. గతంలో ప్రధానమంత్రి పదవి కాపాడుకునేందుకు స్వయంగా ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని అపహాస్యం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కురుక్షేత్రంలో భీష్ముడిని ఎదుర్కొనేందుకు శిఖండిని అడ్డం పెట్టుకున్నట్లే, ప్రధాని నరేంద్ర మోదీ గారి ప్రజాదరణను నేరుగా ఎదుర్కొనే దమ్ములేక ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అబండాలు వేస్తోందని బూర నర్సయ్య గౌడ్ మండిపడ్డారు. షైదుబాయ్ భారతీయ పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్ తన ప్రాణాలను పణంగా పెట్టి 180 మంది ప్రయాణికులను కాపాడితే, ప్రపంచం మెచ్చిన ఆ వీరుడిని అభినందిస్తూ ఒక్క ట్వీట్ లేదా సందేశం కూడా ఇవ్వలేని దేశ వ్యతిరేక మనస్తత్వం ఇండి కూటమి నాయకులదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

2014లో బీజేపీకి 282 సీట్లు, 2019లో 303 సీట్లు రాగా, ప్రస్తుత కమిషన్ హయాంలో 2024లో 240 సీట్లు వచ్చాయని, సీట్లు తగ్గినందుకు బీజేపీ ఎవరిని నిందించాలని అడిగారు. అదే సమయంలో 2014లో 44, 2019లో 52 సీట్లతో ప్రతిపక్ష హోదా కూడా దక్కని కాంగ్రెస్‌కు 2024లో 99 సీట్లు వచ్చాయని, ఈ లెక్కన కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు పాదాభివందనం చేయాలని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో గెలిస్తే నవరంధ్రాలు మూసుకొని అధికారాన్ని అనుభవించడం, ఓడిపోతే ఈవీఎంలు, ఎన్నికల సంఘంపై నిందలు వేయడం కాంగ్రెస్‌కు అలవాటుగా మారిందని దుయ్యబట్టారు.

క్రికెట్ మ్యాచ్ ఆడకముందే ఓటమిని ఊహించి పిచ్‌ను నిందించినట్లుగా, రాబోయే రోజుల్లో ఉత్తరప్రదేశ్, బీహార్, పంజాబ్, గోవాలలో ఓటమి తప్పదని కాంగ్రెస్ ముందే ఇలాంటి సాకులు వెతుక్కుంటోందని ఎద్దేవా చేశారు. ఈసీపై నమ్మకం లేకపోతే ఎన్నికల్లో పోటీ చేయకూడదని, ఈవీఎంలపై అనుమానాలుంటే వాటి ద్వారానే గెలిచి వేల కోట్ల అవినీతికి పాల్పడుతున్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వాల ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ నాయకులు తమ పదవులకు తక్షణమే రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియ సరికాదనుకుంటే జమ్మూ కాశ్మీర్, కేరళ, తమిళనాడులలో పదవులకు రాజీనామాలు చేసి మళ్లీ ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేసే నైతిక ధైర్యం వీరికి ఉందా అని నిలదీశారు. మోదీ గారు నాలుగోసారి ప్రధాని కావడం ఖాయమనే భయం, డీలిమిటేషన్, 'వన్ నేషన్ - వన్ ఎలక్షన్' వస్తే రాజకీయంగా తుడిచిపెట్టుకుపోతామనే అక్కస్సుతోనే కాంగ్రెస్ ప్రజాస్వామ్య వ్యవస్థలను భ్రష్టు పట్టించే గోబెల్స్ ప్రచారం చేస్తోందని హితవు పలికారు. ప్రపంచం కేస్ స్టడీగా ప్రశంసించే 140 కోట్ల జనాభా, 95 కోట్ల ఓటర్ల భారతీయ ఎన్నికల విశ్వసనీయతను దెబ్బతీయొద్దని, మీడియా ప్రతినిధులు కూడా ఈ వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకెళ్లి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

## జేఎన్టీయూ లో రీసెర్చ్ ఎడ్యుకేషన్ అడ్వాన్స్మెంట్ కాంక్లేవ్

జేఎన్టీయూ యూనివర్సిటీలో తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన రీసెర్చ్ ఎడ్యుకేషన్ అడ్వాన్స్మెంట్ కాంక్లేవ్ ఇన్ హైదరాబాద్ పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు సైయంట్ ఐటి కంపెనీ చైర్మన్ బివి మోహన్ రెడ్డి, జేఎన్టీయూ వీసీ కిషన్ కుమార్ రెడ్డి, ఓ యు వీసీ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2047 రైసింగ్ తెలంగాణ ఏ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. విద్య అంటే కేవలం నేర్చుకోవడం కాదు, అది మన మెదడుకు ఇచ్చే శిక్షణ అని అన్నారు. వాస్తవ ప్రపంచంలో సమస్యలను పరిష్కరించడంతోపాటు టెక్నాలజీకి అనుగుణంగా ముందుకు వెళ్లాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యార్థులకు విద్యతో పాటు స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్లను సైతం నిర్వహిస్తూ వారు డిగ్రీ పూర్తి చేసే లోపే ఇండస్ట్రీకి అనుగుణంగా తీర్చి దిద్దేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. అదేవిధంగా ఈ అకాడమిక్స్ కు, ఇండస్ట్రీకి మధ్య ఉన్న గ్యాప్ ను ఫిల్ చేస్తూ ఈ రీచ్ ప్రోగ్రాం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు రెండు లక్షల జాబులను ఇచ్చామని రాబోయే రోజుల్లో కూడా ఇచ్చేలా పనిచేస్తున్నామని అన్నారు అదేవిధంగా ప్రభుత్వ ఉద్యోగము దొరకని వారి కోసం ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఇండస్ట్రీ ఇంట్రాక్షన్ సైతం నిర్వహిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉండే ఐటీ, పారిశ్రామిక అధిపతిలకు మినిస్టర్ శ్రీధర్ బాబు సూచనలు చేశారు గవర్నమెంట్ యూనివర్సిటీలో సి ఎస్ ఆర్ ఫండ్ కింద ఇంక్యుబేటర్ సెంటర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హైదరాబాద్ ఏ హబ్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్, ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ప్రెన్యూర్ షిప్ పేరిట రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి అందరికీ పంపిణీ చేశారు. ఇలాంటి కాంక్లేవ్ నిర్వహించడం ద్వారా విద్యా వ్యవస్థలు మార్పు తీసుకుని రావడంతో పాటు విద్యార్థులకు అకాడమిక్స్ స్కిల్ పెంచడానికి కూడా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనివర్సిటీలకు చెందిన వైస్ ఛాన్సలర్లతో పాటు అధ్యాపకులు పాల్గొన్నారు

# వన్యప్రాణుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన






**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 3:**వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని గుబ్బగుర్తి అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం గుబ్బగుర్తి జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వన్యప్రాణుల ప్రాముఖ్యత, వాటి సంరక్షణ ఆవశ్యకతపై అటవీ శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

వన్యప్రాణులు పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని, అడవులు మరియు వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అధికారులు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో గుబ్బగుర్తి ఎఫ్ ఎస్ ఓ జి. ఉపేంద్రయ్య, ఎఫ్ బి ఓ లు బి. సైదా, యు. అయోధ్యమ్మ, ఇ. జ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివనారాయణ, ఉపాధ్యాయులు పుల్లయ్యచారి, వెంకటేశ్వర్లు, సుజాత, మురళీకృష్ణ, బాబూరావుతో పాటు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చిన్నారులను ఆశీర్వదించిన కోడూరి వీరకృష్ణ .

## గొల్లగూడెంలో ఘనంగా జరిగిన దీత్యా ఓణీల అలంకరణ వేడుక.

## కార్యక్రమంకు నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు కోడూరి హాజరు.

**ఖమ్మం జిల్లా బ్యూరో ప్రజాబలం అక్టోబర్ 3:**తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు,లావణ్య దంపతుల కుమార్తె ఇస్నపల్లి దీత్యా పట్టు వస్త్రాలంకరణ,వారి కుమారుడు ఆదిత్యల పంచకట్టు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు.



ఈ వేడుకలకు సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు కోడూరి వీరకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా కోడూరి వీరకృష్ణ చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ దీత్య, ఆదిత్య లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొని ఆత్మీయంగా అభినందించారు.

ఈ కార్యక్రమంలో ఏజే ఎఫ్ టి నాయకులు ఇస్నేపల్లి లక్ష్మణ్, వార్డు మెంబర్ కోడూరి దుర్గారావు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇస్నేపల్లి వీరయ్య, నంద్రు రామకోటి, ఇస్నేపల్లి తిరుపతిరావు, గొల్లమందల ఏసోబు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సందడితో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

# సరోగసీపై జిల్లా బోర్డు కఠిన నిబంధనలు

## చట్టబద్ధత, వైద్య ప్రమాణాలే ప్రామాణికం

**మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 3:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ఆనంద్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఏఆర్టి/సరోగసీ బోర్డు సమావేశం నిర్వహించారు. సరోగసీ ప్రక్రియలో వైద్యపరమైన అవసరం, చట్టబద్ధత, పారదర్శకత, నైతిక ప్రమాణాలు, భవిష్యత్ తల్లి--శిశు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తూ దరఖాస్తులను బోర్డు సమగ్రంగా పరిశీలించింది.




గర్భధారణకు సంబంధించిన వైద్యపరమైన సమస్యలు, గర్భస్థ శిశువును మోసే సామర్థ్యం, ఇతర ప్రత్యామ్నాయ చికిత్సల అవకాశాలు తదితర అంశాలపై నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. సమావేశంలో గైనకాలజిస్ట్ డాక్టర్ మాధవీలత, శిశు వైద్య నిపుణులు డాక్టర్ శివ కిరణ్ పాల్గొన్నారు.

సరోగసీకి సంబంధించిన మొత్తం 5 దరఖాస్తులను బోర్డు పరిశీలించింది. సరోగసీ (నియంత్రణ) చట్టం, 2021లోని నిబంధనలు, నిర్దేశిత వైద్య ప్రమాణాలు, దరఖాస్తుదారుల అర్హతలు, సంబంధిత పత్రాలను పరిశీలించిన అనంతరం 3 దరఖాస్తులకు ఆమోదం తెలిపి వైద్య ధ్రువీకరణ పత్రాలను జారీ చేసింది.

సరోగసీ ప్రక్రియలో అక్రమాలు, దుర్వినియోగం, వాణిజ్య ప్రయోజనాలకు తావులేకుండా చట్టపరమైన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని బోర్డు స్పష్టం చేసింది. అర్హత కలిగిన దంపతులకు మాత్రమే పూర్తి వైద్యపరమైన, చట్టబద్ధమైన పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తామని డా. ఆనంద్ తెలిపారు.

## తిరువూరులో రాష్ట్రస్థాయి బెంచ్ప్రెస్ ఛాంపియన్షిప్ పోటీల ప్రారంభం

ఎన్టీఆర్ జిల్లాశనివారం నాడు తిరువూరు లో రాష్ట్రస్థాయి బెంచ్ ప్రెస్ ఛాంపీయన్ష్ షిప్ పోటీలు ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా క్రీడాకారులకు ఏసీపీ పి. రామచంద్రరావు ఆపరేషన్ త్రిశూల్పై అవగాహన కల్పించారు. డ్రగ్స్, మహిళల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణపై విస్తృత అవగాహనకల్పించారు.× యువత డ్రగ్స్కు దూరంగా ఉండాలి.. ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించి ప్రమాదాలను అరికట్టాలి. హెల్మెట్, సీట్బెల్ట్ తప్పనిసరి.. అతివేగానికి దూరంగా ఉండాలని సూచించారు. జీరో డ్రగ్స్.. మహిళలపై అఘాయిత్యాలకు జీరో టాలరెన్స్.. సురక్షిత రోడ్లే లక్ష్యం అన్నారు. × ప్రజల భాగస్వామ్యంతో సురక్షిత సమాజ నిర్మాణమే ఆపరేషన్ త్రిశూల్ లక్ష్యమని అన్నారు.

# నారాయణపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కేన్సర్ హాస్పిటల్

## నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 3 :** కేన్సర్‌ను తొలిదశలోనే గుర్తించి మెరుగైన వైద్యం అందించేందుకు సత్తుపల్లి మండలం నారాయణపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కేన్సర్ హాస్పిటల్ ఏర్పాటు కావడం అభినందనీయమని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.




శుక్రవారం నారాయణపురంలో శ్రీ షిరిడీ సాయి జనమంగళం ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కేన్సర్ స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మువ్వా విజయబాబుతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత కేన్సర్ హాస్పిటల్ నిర్మాణ పనులను, హాస్పిటల్ నమూనాను పరిశీలించారు.



అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. మారుతున్న జీవనశైలి, ఇతర కారణాలతో కేన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. వ్యాధిని తొలిదశలోనే గుర్తించి సకాలంలో మెరుగైన చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో హాస్పిటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిన శ్రీ షిరిడీ సాయి జనమంగళం ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.

హాస్పిటల్‌కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వపరంగా పూర్తి సహకారం అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. హాస్పిటల్ నిర్మాణానికి సహకరిస్తున్న రైతులు, గ్రామస్తులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్ దివాకర్, సీపీ సునీల్ దత్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐటీడీఏ పీఓ రాహుల్, మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రపంచ వారసత్వ రామప్ప శిల్పవైభవానికి విదేశీ ప్రతినిధుల ప్రశంసలు.

## కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం అద్భుతమని కొనియాడిన బృందం.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 03 పాలంపేట**ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్పవైభవంపై విదేశీ ప్రతినిధులు ప్రశంసల జల్లు కురిపించారు. కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు.



అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 18 దేశాలకు చెందిన 28 మంది విదేశీ అధికారులు, పాత్రికేయులతో కూడిన బృందం శనివారం ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించింది.



కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం కింద హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ రెండు వారాల సామర్థ్య వికాస శిక్షణను నిర్వహిస్తోంది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 10 వరకు జరుగుతున్న ఈ ప్రత్యేక శిక్షణలో భాగంగా ప్రతినిధుల బృందం అధ్యయన పర్యటన చేపట్టింది.

అల్జీరియా, భూటాన్, కాంబోడియా, ఈక్వడార్, ఫిజీ, ఘనా, లైబీరియా, మాల్దీవులు, మారిషస్, మొజాంబిక్, సీషెల్స్, సియెర్రా లియోన్, శ్రీలంక, టోగో, ఉజ్బెకిస్తాన్, వియత్నాం, జాంబియా, జింబాబ్వే దేశాలకు చెందిన అధికారులు, పాత్రికేయులు ఈ బృందంలో ఉన్నారు.

రామప్ప దేవాలయ సందర్శన సందర్భంగా ఆలయ విశిష్టత, ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రాధాన్యం, శిల్పుల నైపుణ్యం, నిర్మాణ పద్ధతులను ఆలయ గైడ్ విదేశీ ప్రతినిధులకు వివరించారు. భూకంపాలను తట్టుకునేలా ఇసుక పునాది సాంకేతికతను వినియోగించడం, ఆలయ గోపుర నిర్మాణంలో బరువును తగ్గించేందుకు నీటిపై తేలే తేలికపాటి ఇటుకలను ఉపయోగించడం వంటి కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం బృంద సభ్యులను ఆశ్చర్యానికి గురిచేసింది.

నల్లరాతిపై సున్నితమైన నగిషీలతో చెక్కిన నిలువెత్తు శిల్పాలను, నాట్య భంగిమలతో కూడిన శిల్పాలను ఆసక్తిగా తిలకించారు. సూది బెజ్జం దూరేంత సన్నని రంధ్రాలు కలిగిన శిల్పకళను ఆసక్తిగా తిలకించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు వెలుగు మారినా గర్భగుడిలోని శివలింగంపై ఒకే విధంగా వెలుగు పడేలా చేసిన కాకతీయుల ఖగోళ, వాస్తు నైపుణ్యాన్ని కొనియాడారు.

ప్రతి శిల్పం ఆనాటి శిల్పుల ప్రతిభను, భారతీయ సంస్కృతి వైభవాన్ని భావితరాలకు చాటిచెప్పేలా ఉందని ప్రశంసించారు. కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ శైలి, కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్యటన సమన్వయ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, పర్యాటక సమన్వయ అధికారి ధర్మా నాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారంలో నూతన రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సర్పంచ్ కాకులమర్రి శ్రీలత

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 03** ఏటూరు నాగారం ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 9వ వార్డులో గల శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం సమీపంలో నూతన రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కాకులమర్రి శ్రీలత శనివారం అధికారికంగా ప్రారంభించారు



ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వార్డు ప్రజలు, భక్తుల రవాణా సౌకర్యాన్ని మెరుగుపరిచేందుకు ఈ నూతన రోడ్డు నిర్మాణం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. పంచాయతీ పరిధిలో నాణ్యతా ప్రమాణాలతో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.

పనులను త్వరగా, నాణ్యతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు

ఈ కార్యక్రమంలో తుమ్మ మల్లారెడ్డి, ఎండి వలీ బాబా, తాడూరి రఘు, కర్ర రవీందర్ ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, ఎక్స్ ఎంపీపీ తూరం పద్మ, చంద లక్ష్మీనారాయణ,కుమ్మరి చంద్రబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి జనార్ధన్, వార్డ్ సభ్యులు కొండాయి చిన్ని,వీరన్న, వావిలాల కిషోర్, పెద్ద బోయిన బాలకృష్ణ, ఎస్.కె బాబా, యాదగిరి వార్డు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలిమాజీ జడ్పీటీసీ మధుకర్

**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 3(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మర్పల్లి మాజీ జడ్పీటీసీ మధుకర్ పిలుపునిచ్చారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని ఎంసీఏం ఫంక్షన్ హాల్‌లో పార్టీ నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.



హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.



పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు

.మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి సారించాలని నాయకులకు సూచించారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి ,సీనియర్ నాయకులు బట్టు రమేష్, మంగలి రమేష్ మాజీ యూత్ అధ్యక్షులు మధుకర్ ,మాజీ కో అప్షన్ సోహైల్ ,నాయబ్ గౌడ్, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి ,సుధాకర్ రెడ్డి ,పాండు ,పిర్యా నాయక్ ,మైనారిటీ నాయకులు షఫీ ,ఉపసర్పంచ్ మోహన్ ,సోషల్ మీడియా వికాస్ ,నాయకులు చంటి ,ఆనంతి, బాలేష్ ,వీరేశం ,గౌడ్ వెంకట్ రెడ్డి , సంతోష్,తదితరులు పాల్గొన్నారు

# సిరిసిల్లలో నెహ్రూనగర్ శ్రీ అంబ భవాని నూతన ఉత్సవ కమిటీ ఎన్నిక



**రాజన్న సిరిసిల్ల జిల్లా అక్టోబర్ 3,( ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌లో శ్రీ అంబ భవాని దేవి నూతన ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాబోయే ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సభ్యులందరి సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షులు కట్ల సంజీవ్,ఉపాధ్యక్షులు ఆడెపు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి బూర భాస్కర్ (బాబీ),కోశాధికారి దూస వేణు,సహాయ కార్యదర్శి ఎల్లిగెటి రామానుజం,ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ... తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నెహ్రూనగర్ ప్రజలకు, కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలను విజయవంతం చేయడానికి కమిటీ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని పేర్కొన్నారు.

## వికారాబాద్ నియోజకవర్గప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సనా గారి కొండల్ రెడ్డి



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 3(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం వికారాబాద్ నియోజకవర్గంఅర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ సనా గారి కొండల్ రెడ్డి పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు .మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని ఎస్.కె ఆర్టిస్ట్ వ్యవస్థాపకులు సనా గారి కొండల్ రెడ్డి సూచించారు.

## ఏటూరునాగారంలో తక్షణమే కోర్టు ఏర్పాటు చేయాలి

### ప్రజల న్యాయపరమైన ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలి

### ములుగు జిల్లా మాల మహానాడు నాయకుడు కాళ్ల రామకృష్ణ డిమాండ్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 03 ఏటూరు నాగారం** ఏటూరునాగారంలో డివిజన్లో తక్షణమే న్యాయస్థానం (కోర్టు) ఏర్పాటు చేసి, ఈ ప్రాంత ప్రజలకు న్యాయం అందుబాటులోకి తీసుకురావాలని ములుగు జిల్లా మాల మహానాడు నాయకుడు కాళ్ల రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఏటూరునాగారం పరిసర ప్రాంతాలైన కన్నాయిగూడెం, మంగపేట, తాడ్వాయి, వెంకటాపురం, వాజేడు తదితర మండలాలకు ఏటూరునాగారం కేంద్రంగా ఉండటంతో ఇక్కడ కోర్టు ఏర్పాటు చేస్తే ఆయా మండలాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని ఆయన అన్నారు.

ప్రస్తుతం న్యాయపరమైన విషయాల కోసం ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో ప్రయాణ భారం, సమయం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల ప్రజలకు న్యాయ సేవలు సులభంగా అందేలా ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు చేయడం అత్యవసరమని పేర్కొన్నారు.

ప్రజల అవసరాలు, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం మరియు సంబంధిత న్యాయశాఖ అధికారులు ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటుపై తక్షణ చర్యలు చేపట్టాలని కాళ్ల రామకృష్ణ కోరారు. ప్రజలకు న్యాయం మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ఈ డిమాండ్‌ను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ లు ఒంటెద్దు పోకడలు మానుకోవాలి.

### --సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు.



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి / తొర్రూరు అక్టోబర్ 03 (ప్రజాబలం):** తొర్రూరు మున్సిపల్ చైర్మన్,కమిషనర్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు.తమకు సంబంధం లేకుండా తీర్మానాలు చేస్తున్నారంటూ ఆరోపిస్తూ మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు బహిష్కరించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ముందు కౌన్సిలర్లతో తీర్మానాలపై చర్చించాల్సి ఉంటుందని,వాటినే సమావేశంలో ఎజెండాగా పెట్టాల్సి ఉంటుందని తెలిపారు. దానికి విరుద్ధంగా మున్సిపల్ చైర్మన్,కమిషనర్ సభ్యులకు తెలియకుండా వారికి వారే అంశాలు నిర్ణయించుకుని ఎలాంటి చర్చ లేకుండా సమావేశంలో ఏకపక్షంగా పెట్టాలని చూడటం దారుణమన్నారు.తెలంగాణ మున్సిపల్ చట్టంను అనుసరించి చైర్మన్,కమిషనర్ వ్యవహరించాల్సి ఉంటుందని, దానికి విరుద్ధంగా పాలకుడు, అధికారి వ్యవహరిస్తున్నారన్నారు. ఎజెండా కాపీలు సభ్యులకు అందజేయకుండా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు.తొర్రూరు పట్టణ అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరిస్తామని తెలిపినప్పటికీ...అధికార పార్టీ చైర్మన్,కమిషనర్ ప్రతిపక్ష సభ్యుల గొంతు నొక్కుతున్నారన్నారు.కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి సైతం కమిషనర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని అన్నారు.పట్టణ అభివృద్ధికి కాకుండా సొంత అభివృద్ధి కోసం పాకులాడుతున్నారని, ఈ విషయంలో పాలకవర్గం తీరు మారకపోతే ఉన్నతాధికారులను కలిసి నివేదిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్లు కర్నే నాగరాజు, భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, చకిలేల అలివేలు, మాదుగుల భవానీ లత, అల్లం శ్యామల శ్యామ్, కిన్నెర కవిత సతీష్, ధరావత్ పద్మ కిషన్ నాయక్, మాజీ కౌన్సిలర్లు ధరావత్ జైసింగ్ నాయక్, గుగులోత్ శంకర్,నాయకులు రాయిశెట్టి వెంకన్న, భూసాని ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

## 9 నుంచి హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్

హెచ్ఐసీసీ నోవాటెల్ హోటల్లో ఈ నెల 9వ తేదీ నుంచి హైలైఫ్ బ్రైడ్స్ ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన సన్నాహక కార్యక్రమం బంజారాహిల్స్లో జరిగింది. నటి రీతు చౌదరితో పాటు పలువురు మోడల్స్ ఈ కార్యక్రమంలో పాల్గొని బ్రోచర్ ఆవిష్కరించడంతో పాటు ఎగ్జిబిష న్లో ప్రదర్శించబోయే దుస్తులు, నగలను ధరించి హొయలు పోయారు.

## నేడు తొర్రూరు పట్టణ పరిధిలో విద్యుత్ అంతరాయం. తొర్రూరు విద్యుత్ డివిజనల్ అధికారి కృష్ణ.



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి / తొర్రూరు అక్టోబర్ 03 (ప్రజాబలం):** నేడు తొర్రూరు విద్యుత్ సబ్‌స్టేషన్ నందు విద్యుత్ సరఫరాలను మెరుగుపరిచేందుకు 5 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ను 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ గా కెపాసిటీ పెంచే విషయంలో ఆదివారం ఉదయం 7 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు తొర్రూరు పట్టణం, చింతలపల్లి, పాలకేంద్రం, సోమ్లా తండా, దుబ్బతండ, కొమ్మనపల్లితండ తదితర ప్రాంతాల వినియోగదారులు విద్యుత్ అంతరాయం కలుగుతుందని తొర్రూరు డివిజన్ ఇంజనీర్ ఎన్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు పట్టణంతోపాటు తొర్రూరు పట్టణ పరిధిలో ఉన్న పైన తెలిపిన ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మర్పల్లి పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోవాలి మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 3(ప్రజా బలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండలం అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరుగా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుతుమ్మల సురేష్ యాదవ్,పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదు, అవగాహన కార్యక్రమం గురించిమాట్లాడారుహైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేర్లను పట్టభద్రుల ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల నియోజకవర్గ ఓటరుగా నమోదుకు ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారు ఫారం--18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సాధారణంగా సంబంధిత అర్హత తేదీకి కనీసం మూడు సంవత్సరాల ముందు డిగ్రీ లేదా సమానమైన అర్హత పొందిన వారు సంబంధిత నియోజకవర్గంలో సాధారణ నివాసితులై ఉంటే పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో నమోదు చేసుకునే అర్హత కలిగి ఉంటారని అన్నారు

.మండలంలోని ప్రతి గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టభద్రులను గుర్తించి, వారికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు పట్టభద్రుడు ఓటరు నమోదుకు దూరం కాకుండా గ్రామాల వారీగా ప్రత్యేక దృష్టి పెట్టి యువత నమోదు కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలోసారించాలని మర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల సురేష్ యాదవ్ సూచించారు.

## నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

### జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన :: గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఐఏఎస్.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 03 గోవిందరావుపేట**నివారం గోవిందరావుపేట మండలం బుస్సాపూర్, తాడ్వాయి మండలం మేడారం, వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామపంచాయతీల పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి, ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సకాలంలో ఖాతాల్లో జమ అవుతోందా అని ఆరా తీశారు. ఆర్థిక సాయం సకాలంలో అందుతోందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని లబ్ధిదారులు వివరించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి మాట్లాడుతూ, రెండవ విడతలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, గుడిసెల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బిల్లుల మంజూరు విషయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు మధ్యవర్తులను, దళారులను ఆశ్రయించవద్దని, అర్హత ఆధారంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి, ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, హౌసింగ్ పి.డి. కృష్ణ ప్రసాద్, స్థానిక తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ ఏ ఈ లు, ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తూర్ సురేందర్



**జహీరాబాద్, అక్టోబర్ 3 ప్రజాబలం ప్రతినిధి:** ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టీయూసీ)ను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పలు నియామకాలు చేపట్టారు. ఇందులో భాగంగా జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కొత్తూర్ సురేందర్‌ను తెలంగాణ రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి నియామక ఉత్తర్వులు జారీ చేసి, సురేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాంగ్రెస్ అనుబంధ కార్మిక విభాగమైన ఐఎన్‌టీయూసీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్తూర్ సురేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షుడు అంబటి కృష్ణమూర్తి, న్యాయ సలహాదారు జంబూల నర్సింహారెడ్డి, జాతీయ ఉపాధ్యక్షుడు మ్యాతారి ప్రవీణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి అన్ని వర్గాల వారితో కలిసి పనిచేస్తానన్నారు. ఐఎన్‌టీయూసీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

## ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే పంటను విక్రయించాలి :సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్



**మెదక్ ఉమ్మడి జిల్లా ప్రజాబలం ప్రతినిధి యెదుగని అంజయ్య** :శనివారం నాడు నిజాంపేట మండలం రాంపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది. రైతులు దళారుల చేతిలో మోసపోవద్దని ప్రభుత్వము ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే పంటను విక్రయించాలని సర్పంచ్ పొన్నబోయిన ప్రవీణ్ గ్రామస్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏల అనిల్ పంచాయతీ కార్యదర్శి చంద్రహాస్ మరియు గ్రామస్తులు ఎండి గౌస్, లక్ష్మణ్ గౌడ్, వెంకట్ స్వామి గౌడ్, శ్రీనివాస్, లింగం గౌడ్, రాజు, పరశురాములు, బాలరాజు, ఫిరోజ్, అశోక్ గౌడ్, శ్రీకాంత్, ప్రశాంత్, అరుణ్ పాల్గొన్నారు.



## పట్టభద్రుల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి

### 22-A పేరుతో పేదల భూములను లాక్కోవాలని చూస్తున్న ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలి

### మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఎక్కడ? మంత్రి సీతక్క సమాధానం చెప్పాలి

### బడే నాగజ్యోతిజిల్లా చైర్మన్ మాజీ

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి అక్టోబర్ 03 తాడ్వాయి** తాడ్వాయి మండలంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు దండుగుల మల్లయ్య గారి ఆధ్వర్యంలో బి ఆర్ ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బి ఆర్ ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి హాజరయ్యారు.





ఈ సందర్భంగా బడే నాగజ్యోతి మంత్రి సీతక్కపై, తాడ్వాయి మండల అభివృద్ధి, మేడారం భక్తుల సౌకర్యాలు, పట్టభద్రుల సమస్యలు, 22-A భూముల అంశం, యూరియా కొరత తదితర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

తాడ్వాయి మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపకుండా అభివృద్ధి జరిగిందని చెప్పుకోవడం సరికాదని బడే నాగజ్యోతి అన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు

.మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఎక్కడ?

"మేడారం అభివృద్ధికి వందల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారు. ముఖ్యంగా రూ.300 కోట్ల అభివృద్ధి అని చెబుతున్నప్పుడు ఆ అభివృద్ధి క్షేత్రస్థాయిలో ఎక్కడ కనిపిస్తోంది? భక్తులకు అవసరమైన సౌకర్యాలు ఎందుకు పూర్తిస్థాయిలో అందుబాటులో లేవు?" అని మంత్రి సీతక్కను బడే నాగజ్యోతి ప్రశ్నించారు.

మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం ఎక్కడ?

లక్షలాది మంది భక్తులు వచ్చే మేడారంలో మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం, రవాణా వంటి ప్రాథమిక సౌకర్యాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

"మేడారం పేరు చెప్పుకుని ప్రచారం చేయడం కాదు.. క్షేత్రస్థాయిలో భక్తులకు కనిపించేలా అభివృద్ధి చేసి చూపించాలి" అని అన్నారు.

22-A జాబితా పేరుతో పేదలు, రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అనిశ్చితి నెలకొనడం ఆందోళనకరమని అన్నారు.

"పేద ప్రజలు, రైతుల భూములపై హక్కులు కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలి. భూముల విషయంలో ప్రజలకు న్యాయం జరిగే వరకు వారి తరఫున దీRS పార్టీ పోరాడుతుంది

రాష్ట్రంలో రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని బడే నాగజ్యోతి అన్నారు.

"రైతులకు సకాలంలో ఎరువులు అందించడం ప్రభుత్వ బాధ్యత. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడే పరిస్థితి ఎందుకు వచ్చింది? రైతులకు అవసరమైనంత యూరియాను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలి" అని డిమాండ్ చేశారు.

రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థి విధానాలు, గతంలో చేసిన కార్యక్రమాలను వివరించాలని పిలుపునిచ్చారు.

"పట్టభద్రుల సమస్యలు, నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్యా రంగానికి సంబంధించిన అంశాలపై పట్టభద్రులతో నిరంతరం మమేకం కావాలి. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి బి ఆర్ ఎస్ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి" అని అన్నారు.

22-A భూములు, యూరియా, మేడారం అభివృద్ధి, స్థానిక మౌలిక వసతులు వంటి ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటాలను బలోపేతం చేయాలని బడే నాగజ్యోతి అన్నారు.

"ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా బి ఆర్ ఎస్ పార్టీ ఉంటుంది. ప్రజలకు అన్యాయం జరిగితే ఎక్కడైనా వారి తరఫున నిలబడి పోరాటం చేస్తాం" అని తెలిపారు.

బి ఆర్ ఎస్ పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాను. ఎవరి ఒత్తిళ్లకు, బెదిరింపులకు కార్యకర్తలు భయపడాల్సిన అవసరం లేదు. కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుంది. ప్రతి కార్యకర్త కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ కుటుంబం అండగా నిలుస్తుంది" అని బడే నాగజ్యోతి భరోసా కల్పించారు.

కార్యకర్తలే పార్టీకి బలం

"పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తలే దీ=ూ పార్టీకి నిజమైన బలం. కార్యకర్తల సమస్యలను నా సమస్యలుగా భావించి వారి కోసం ఎప్పుడూ ముందుంటాను. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తాం" అని బడే నాగజ్యోతి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు దండుగుల మల్లయ్య, నుషిట్టి రమేష్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య,మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్లు కాక లింగయ్య, నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్ రెడ్డి,మంగపేట మండల పార్టీ మాజీ అధ్యక్షులు కుడుముల లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు

## బిజెపి నాయకునికి అండగా ఉంటాం కొల్చారం మండలం బిజెపి అధ్యక్షులు హరీష్.










**మెదక్ జిల్లా కొల్చారం మండలం ని(ప్రజాబలం )ప్రతినిధి.** బిజెపి నాయకునికి అండగా ఉంటామని కొల్చారం మండలం బిజెపి అధ్యక్షులు హరీష్. నిన్న జరిగిన సంఘటన బిజెపి సీనియర్ నాయకుడు దాసు నరసింహులు అవమాన పరిచిన విషయాన్ని తెలుసుకున్న మండల బిజెపి పార్టీ శ్రేణులు ఆధారంగా గ్రామానికి వచ్చి పంచాయతీ కార్యదర్శి సర్పంచ్ లేకపోవడంతో ఫోన్లో మాట్లాడగా ఏ పార్టీ నాయకులకైన కించపరిచేలాసరైన ప్రవర్తించడం జరగకూడదని పంచాయతీ కార్యదర్శి మౌనికకు మాట్లాడడం జరిగింది సమాధానం చెప్పకపోవడంతో పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని బిజెపి అధ్యక్షులు హరీష్ అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి కిష్టాపూర్ స్వప్న ఉషయ్య ఉపసర్పంచ్ శేఖర్ బిజెపి నాయకులు శ్రీనివాస్ భూమ గౌడ్ గొల్ల కొమురయ్య దగ్గ నరేష్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు

## బస్‌స్టాండ్‌లో బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్ ప్రారంభం




**జహీరాబాద్, అక్టోబరు 3 ప్రజాబలం ప్రతినిధి:** జహీరాబాద్ బస్‌స్టాండ్‌లో తల్లులు శిశువులకు ప్రశాంతమైన వాతావరణంలో తల్లిపాలు అందించేందుకు ఏర్పాటు చేసిన బ్రెస్ట్‌ఫీడింగ్ క్యాబిన్‌ను జిల్లా సంక్షేమ అధికారి లలితాకుమారి, మున్సిపల్ చైర్మన్ యూనుస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలపై అవగాహన కల్పించారు. అనంతరం రాచన్న పేటలోని గౌరీ ప్యాలెస్‌లో పోషణ్ మాహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సమతుల్య పోషకాహారం అందించాలని అధికారులు సూచించారు. శిశువు జీవితంలోని తొలి 1,000 రోజులు కీలకమని తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో సుశీల, ఎంఆర్ఓ దశరథ్, జిల్లా కోఆర్డినేటర్ పల్లవి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



## పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలాధారం

### 'స్పెషల్ క్యాంపెయిన్-6 లో జీఎం ఎన్. రాధాకృష్ణ పిలుపు?



మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ శనివారం రోజున మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయ ఆవరణలో ప్రారంభమైన "స్పెషల్ క్యాంపెయిన్ - 6 " స్వచ్ఛ-స్వచ్ఛ భారత్" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు.?ఈ సందర్భంగా జీఎం గారు మాట్లాడుతూ, పూజ్య బాపూజీ కలలు కనిన స్వచ్ఛ భారత స్వప్నాన్ని సాకారం చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. "గాంధీజీ కేవలం రాజకీయ స్వతంత్ర భారతమే కాకుండా, పరిశుభ్రమైన మరియు అభివృద్ధి చెందిన దేశాన్ని ఆకాంక్షించారు. ఆయన స్ఫూర్తితో 'స్వచ్ఛ తెలంగాణ' లక్ష్యాన్ని సాధిస్తూ, స్వచ్ఛ భారత్ రూపకల్పనలో సింగరేణి కుటుంబాలన్నీ భాగస్వామ్యం కావాలి అని పిలుపునిచ్చారు.పరిసరాల అపరిశుభ్రత వలన వ్యాధులు ప్రబలుతాయని, ఇది మన ఆరోగ్యంతో పాటు సమాజ ఆరోగ్యానికి కూడా హాని కలిగిస్తుందని హెచ్చరించారు. వారానికి కనీసం రెండు గంటలు శ్రమదానం చేసి మన ఇల్లు, పరిసరాలు, మరియు పని చేసే కార్యాలయాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మనం పాటించే ఈ పరిశుభ్రత, క్రమశిక్షణ రాబోయే భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి అని పేర్కొన్నారు.కార్యాలయాలు, గనులు మరియు పని ప్రాంతాలలో ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం ఉంటే ఉద్యోగుల పనితీరు, ఉత్పాదకత మెరుగవుతాయని ఆయన తెలిపారు. సింగరేణి అధికారులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రతను ఒక నిత్యకృత్యంగా మలుచుకుని, స్వచ్ఛమైన వాతావరణంలో "రక్షణతో కూడిన ఉత్పత్తి" కూడా సాధించవచ్చని ఆకాంక్షించారు.అనంతరం అధికారులు, ఉద్యోగులతో స్వచ్ఛ-స్వచ్ఛభారత్ (స్పెషల్ క్యాంపెయిన్-6) ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం, జి.ఎల్. ప్రసాద్, ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, సలేంద్ర సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఎన్విరాన్మెంట్ అధికారి కాతం వెంకట్ రెడ్డి, సీనియర్ పి ఓ, ఎం.కార్తీక్, ఏఐటియుసి, జి ఎం ,స్ట్రక్చర్ కమిటీ మెంబర్, సి.వి.రమణ,జిఎం ఆఫీస్ ఫిట్ సెక్రటరీ గీతిక మరియు జిఎం ఆఫీస్ ఉన్నత అధికారులు, అధికారులు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com